
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



విశాఖపట్నం

జిల్లా వార్తలు

ఆదివారం 18 మే 2025

20 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు



ఉక్కుటౌన్‌షిప్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు శనివారం ఉక్కునగరంలో జరిగిన ... మిగతా 6వ పేజీలో

వీడని ఉత్కంఠ

డిప్యూటీ మేయర్ పదవి కోసం టీడీపీలో ముగ్గురు మధ్య పోటీ

- తమకు ఇవ్వాల్సిందేనని జనసేన పట్టు...
- పరిశీలనలో ఇద్దరు పేర్లు
- నేడు మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు భేటీ
- డిప్యూటీ మేయర్ పేరును ఖరారు చేసే అవకాశం



విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎవరనే దానిపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. సోమవారమే కొత్త డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనున్నందున ఆశావహుల మధ్య పోటీ తీవ్ర స్థాయికి చేరింది. ఒకవైపు డిప్యూటీ మేయర్ పదవి తమదేనని ధీమాతో వున్న టీడీపీ ఆశావహులకు తాజాగా జనసేన కూడా తమకు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తుండడంతో రెండు పార్టీల ప్రజాప్రతినిధులను మరింత ఇరకాటంలో పెట్టినట్టయింది. టీడీపీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లు, జనసేన నుంచి ఇద్దరు కార్పొరేటర్లు ఈ పోస్టు కోసం తీవ్రంగా పోటీపడుతుండడంతో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, మేయర్ ఆదివారం భేటీ అయి అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉంది.

జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు గతనెల 26న అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో ఆయన పదవి నుంచి వైదొలిగారు. ఆ తరువాత ఈ పదవి కోసం టీడీపీకి చెందిన ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పోటీపడుతున్నారు. వైసీపీ హయాంలో మేయర్‌గా పనిచేసిన గొలగాని హరివెంకటకుమారిని పదవి నుంచి తొలగించి, వేరొక సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావుకు మేయర్ పదవిని అప్పగించినందున, డిప్యూటీ మేయర్ పోస్టును యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఇవ్వడం ద్వారా తమ సామాజిక వర్గంలో టీడీపీ పట్ల అసంతృప్తి రాకుండా చూడాలంటూ ఆ వర్గానికి చెందిన కార్పొరేటర్లు కోరుతున్నారు. ఆ కోణంలో పరిశీలిస్తే తమకు అవకాశం ఇవ్వాలని 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు తూర్పు నియోజకవర్గానికి వీఎంఆర్డీఏ ఛైర్మన్ పదవిని ఇవ్వగా, గాజువాక నియోజక వర్గానికి సంబంధించి ... మిగతా 6వ పేజీలో

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి





ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

నగరవాసులకు మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపు

వేసవి నుంచి ఉపశమనానికి 'బీట్ ద హీట్' పేరిట కార్యక్రమాలు

నీటిని ఆదా చేయడంతో పాటు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి

-8లో

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్


- నగరంలో పది కేంద్రాల ఏర్పాటు
- ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షల నిర్వహణ

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

దేశంలో ఐఐటీలు/తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆదివారం విశాఖలోని 10 కేంద్రాల్లో జరగనున్నది. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలను చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ సెంటర్‌లోని మూడు కేంద్రాలు, షీలానగర్‌లో ఒక సెంటర్, రుషికొండలోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాల, ఆనందపురం మండలంలోని నడింపల్లి సత్యనారాయణరాజు ఇంజనీరింగ్ కళాశాల, బక్కన్నపాలెంలోని బాబా ఇంజనీరింగ్ కళాశాల, దువ్వాడలోని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, పెదగంట్యాడ కేవీఎల్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్‌లో నిర్వహిస్తారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరూ ఉదయం ఏడు గంటలకల్లా ఆయా కేంద్రాల వద్ద రిపోర్టు చేయాలి. అడ్మిట్ కార్డు మేరకు తనిఖీ, బయోమెట్రిక్ వేయడం పూర్తయ్యాక ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష కేంద్రంలో కంప్యూటర్‌ను కేటాయిస్తారు. అభ్యర్థులెవరూ పెన్ను, పెన్సిల్, తెల్ల కాగితం వంటివి తీసుకురాకూడదు. చిన్న శానిటైజర్ బాటిల్, నీరు బయటకు కనిపించేలా ఉండే వాటర్ బాటిల్‌ను మాత్రమే అనుమతిస్తారు. మహిళా అభ్యర్థులు ముక్కుపుడక, చెవిదుద్దులు, చైన్లు, చేతి గొలుసు వంటివేవీ లేకుండా పరీక్ష కేంద్రాలకు రావాలి.

ఒక పోస్టుకు 26 మంది..

డీఎస్సీకి తీవ్ర పోటీ



- ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 1,139 ఉపాధ్యాయ ఖాళీలు
- 29,779 మంది అభ్యర్థులు.. 49,658 దరఖాస్తులు
- పురుషుల కంటే 6,233 మంది మహిళా అభ్యర్థులే అధికం
- అత్యధికంగా ఎస్టీ కేటగిరీలో 10,523 మంది దరఖాస్తు
- బీసీ-డీలో 8,330 మంది..

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీకి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకు 29,779 మంది 49,658 దరఖాస్తు చేశారు. ఒక్కో పోస్టుకు సగటున 26 మంది పోటీపడుతున్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 734 పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో 400 ఎస్జీటీ పోస్టులు, జువెనైల్ పాఠశాలలో ఐదు పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 29,779 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఎక్కువ మంది రెండు అంతకంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయడంతో మొత్తం 49,658 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో పురుషులు 11,773 మంది, మహిళలు 18,006 మంది ఉన్నారు. పురుషుల కంటే 6,233 మంది మహిళా అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. రిజర్వేషన్ కేటగిరీలవారీగా పరిశీలిస్తే ఎస్టీ నుంచి అత్యధికంగా 10,523 మంది దరఖాస్తు చేశారు. ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో 400 ఎస్జీటీ పోస్టులు ఉండడంతో గిరిజన ప్రాంతాల నుంచి భారీగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. మొత్తం అభ్యర్థుల్లో మూడింట ఒక వంతు ఈ కేటగిరీకి చెందినవారు కావడం విశేషం. ఆ తరువాత వెనుకబడిన వర్గాలకు సంబంధించి ఐదు కేటగిరీలకు కలిపి 13,454 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా.. వీరిలో అత్యధికంగా బీసీ-డీ నుంచి 8,330, తరువాత బీసీ-బీ నుంచి 2,563 మంది, బీసీ-ఏ నుంచి 1,940, బీసీ-ఈ నుంచి 423, బీసీ-సీ నుంచి 198 మంది ఉన్నారు. ఓపెన్ కేటగిరీ నుంచి 1,626 మంది దరఖాస్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు తరువాత విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్సీ కేటగిరీ-1 నుంచి 479 మంది, కేటగిరీ-2 నుంచి 876 మంది, కేటగిరీ-3 నుంచి 2,821 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. దివ్యాంగుల కోటాలో అన్ని కేటగిరీలు కలిపి 890 దరఖాస్తులు వచ్చాయి.

మానవత్వం చాటుకున్న హోం మంత్రి అనిత

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి స్వయంగా సపర్యలు



క్షతగాత్రుడిని దగ్గరుండి ఆస్పత్రికి పంపిస్తున్న హోం మంత్రి అనిత

అక్కయ్యపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి స్వయంగా సపర్యలు చేశారు. ఈ ఘటన నగరంలోని తాటిచెట్లపాలెం కూడలిలో శనివారం చోటుచేసుకుంది. తాటిచెట్లపాలెం కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అచేతన స్థితిలో పడివున్న ఓ యువకుడిని చూసిన హోంమంత్రి ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న తన కాన్వాయ్‌ను ఆపారు. వెంటనే కారు దిగి సహాయక చర్యలు చేపట్టారు. సంఘటన స్థలంలో గాయపడి ఉన్న ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించాలని పోలీసులను ఆదేశించారు. ప్రమాదానికి కారణాలు, క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

హుద్‌హుద్ ఇళ్లను అమ్మేశారు

ఇంకొందరు అద్దెలకు ఇచ్చేశారు..

- పైనాపిల్ కాలనీలో గల గృహ సముదాయంలో 106 మంది ఇతర ప్రాంతాల వారు నివాసం



పైనాపిల్ కాలనీలో హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మించిన గృహ సముదాయం

విశాఖపట్నం/ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని పైనాపిల్ కాలనీలో నిర్మించిన హుద్‌హుద్ గృహ సముదాయంలో కొన్నింటిని లబ్ధిదారులు అమ్మేశారు.. మరికొందరు అక్కడ నివాసం ఉండకుండా అద్దెకు ఇచ్చేశారు. మొత్తం ఇక్కడ 320 ఇళ్లకు గాను 106 మంది స్థానికేతరులే నివాసం ఉంటున్నారు. జీవీఎంసీ యూసీడీ విభాగం చేపట్టిన సర్వేలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

హుద్‌హుద్ తుపాన్‌కు ఇళ్లు కోల్పోయిన బాధితులకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నగరంలో పలుచోట్ల ఇళ్లు నిర్మించింది. ఇందులో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన బాధితులకు పైనాపిల్ కాలనీతోపాటు మరో రెండు మూడుచోట్ల గృహ సముదాయాలను నిర్మించారు. ఆయా కాలనీల్లో ఇళ్ల కేటాయింపుల కోసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశారు. అయితే ఇళ్ల నిర్మాణం తరువాత మౌలికవసతుల కల్పనలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారుల జాబితాలో మార్పులు చేసి కొందరు వైసీపీ సానుభూతిపరులకు ఇళ్లను కేటాయించారు. దీనిపై తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పలు దఫాలు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదులు కూడా చేశారు. ఆ తరువాత 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇళ్ల సముదాయంలో అసలైన లబ్ధిదారులు ఎవరనేది తేల్చాలని రామకృష్ణబాబు జీవీఎంసీ కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మధురవాడ జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో యూసీడీ విభాగం ఉద్యోగులు విచారణ చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎవరు ... మిగతా 6వ పేజీలో

ఇసుక సరఫరాలో గోల్‌మాల్‌పై కలెక్టర్ ఆరా

- క్షేత్రస్థాయిలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు
- అడ్డగోలుగా అవినీతికి పాల్పడుతున్నవైనం
- కార్లను వినియోగిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఈలు

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సెంటు భూమిలో నిర్మిస్తున్న ఇళ్లకు సరఫరా చేసే ఇసుక గోల్‌మాల్‌పై జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆరా తీశారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

'ఇసుక సరఫరాలో గోల్‌మాల్' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నగర శివార్లలోని లేఅవుట్లలో ఇళ్లకు సరఫరా చేసే ఇసుక వినియోగంపై వివరాలు సమర్పించాలని హౌసింగ్ అధికారులకు ఆయన ఆదేశించారు. దీంతో శనివారం ... మిగతా 6వ పేజీలో

దృష్టంతా చలానాలపైనే..

ట్రాఫిక్ నియంత్రణ గాలికి

- వాహనాలను ఆపి పెండింగ్ చలానాల తనిఖీ
- ఒక్కో పోలీస్ స్టేషన్‌కు రోజుకు 150 చలానాల టార్గెట్
- ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శల వెల్లువ



మద్దిలపాలెం కూడలిలో వాహనాలను నిలిపివేసి పెండింగ్ ఈ-చలానాలపై తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

మహా నగరంలో ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాల్సింది పోయి, వచ్చిపోయే వాహనాలను నిలిపివేసి పెండింగ్ చలానాలు ఎన్ని ఉన్నాయో తనిఖీ చేయడంలో ట్రాఫిక్ పోలీసులు నిమగ్నమైపోతున్నారు. దీనివల్ల వాహనచోదకులు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలకు అవకాశం కల్పించినట్టవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో వాహనాల రాకపోకలు సక్రమంగా సాగిపోయేలా చూసి, ట్రాఫిక్ జామ్‌లు జరగకుండా చూడడం, వాహనచోదకులంతా ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా పాటించడం ద్వారా ప్రమాదాల బారినపడకుండా కాపాడడం కోసం ట్రాఫిక్ పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. నగరంలో ప్రతీ కూడలి వద్ద ట్రాఫిక్ అవుట్‌పోస్టులు, ఐలాండ్‌లను ఏర్పాటు చేసి అక్కడ విధులు నిర్వర్తించేలా ఒక హెడ్‌కానిస్టేబుల్/కానిస్టేబుల్‌తోపాటు హోంగార్డును నియమిస్తున్నారు. వీరంతా తమకు కేటాయించిన డ్యూటీ వేళల్లో అక్కడ నిలబడి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి వాహనాన్ని నడిపితే సెల్ ఫోన్‌లో ఫొటో తీసి తమపై అధికారికి పంపి ఈ-చలానా జారీ చేసేలా పనిచేయాల్సి ఉంటుంది.

అయితే గత కొద్దిరోజులుగా నగరంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ పోలీసులు తమ ప్రధానవిధిగా చెప్పుకునే ట్రాఫిక్ క్రమబద్ధీకరణను విస్మరించి.. నలుగురైదుగురు ... మిగతా 6వ పేజీలో

అదృశ్యమైన బాలిక కిడ్నాప్

- సీసీ కెమెరాల ఫుటేజీల్లో గుర్తించిన పోలీసులు
- పెదగంట్యాడకు చెందిన మహిళగా నిర్ధారణ
- భర్తతోపాటు అదుపులోకి తీసుకున్న పోలీసులు
- బాలికను విడిపించి, తల్లిదండ్రులకు అప్పగింత
- రెండు రోజుల్లోనే కేసును ఛేదించినందుకు ఎస్పీ అభినందనలు



భీశెట్టి లోహిత (ఫైల్‌ఫొటో)

- 6లో

సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

తగరపువలస, మే 17 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే అఖిల భారత కార్మికుల సమ్మెను ప్రజలు జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం చిట్టివలసలోని సీఐటీయూ కార్యాలయంలో నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలుత ఈనెల 20న సమ్మె జరగాల్సి ఉండగా, దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో జూలై 9వ తేదీకి వాయిదా పడిందన్నారు. కార్మికులు, కర్షకుల సమస్యలతో పాటు నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో సమ్మె చేప డుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు, పి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

ఆరు నెలల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి



పాఠశాల వద్ద నిర్మించనున్న బ్రిడ్జి నమూనాను పరిశీలిస్తున్న గంటారవితేజ

కొమ్మాది, మే 17 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని టీడీపీ యువ నాయకుడు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ తెలిపారు. శనివారం ఆయన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ వల్ల రూ. 3.23 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు. ఒకటి రెండు నెలల్లో టెండర్లు ఖరారు చేసి, పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కె. కనకమహాలక్ష్మి, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకట్రావు, జీవన్ కుమార్, గరే గురునాథ్, కె. అచ్యుతరావు, మన్యాల సోంబాబు, నాగోతి సత్యనారాయణ, జానకీ రామ్, పోతిన వెంకట్రావు, పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధి పనులు పరిశీలన

భీమునిపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు పరిధిలోని కాపులుప్పాడలో వీఎంఆర్‌డీఏ, ధాన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న చెరువుల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ క్యాస్కేడ్ పేరుతో జనవరిలో ఈ పనులు ప్రారంభించామని, గ్రామంలో పోతినవాని చెరువు, బాడవ చెరువుల్లో పూడికతీత జరుగుతుందని చెప్పారు. పనోతినవాని చెరువులో రెండవ దశ పనులతో పాటు దేవదావని, కంబాల చెరువుల పునరుద్ధరణ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రవితేజ కాపులుప్పాడ సమీపంలో ఉన్న గంభీరం గెడ్డను పరిశీలించి, స్థానికుల సమస్యలు విన్నారు. అలాగే ఆనందపురం మండలంలోని పొర్లవాని చెరువు, మర్రి చెరువులను సందర్శించారు. శిర్లపాలెం హైస్కూల్‌ను సందర్శించి, సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, ఎంఈవో ఉన్నారు.

21న డీఈవో కార్యాలయం ముట్టడి

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21వ తేదీన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. శనివారం డాబాగార్డెన్‌లో గల ఆర్‌బీఎం యూపీ పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జి.గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలతో స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్-117తో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. దీనిని రద్దుచేస్తామని హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... పాఠశాల విద్యకు మరింత ప్రమాదం తెచ్చేపెట్టేలా జీవో 19, 20, 21లను తీసుకువచ్చి తొమ్మిది రకాల బడులను అమలు చేయడం అన్యాయమన్నారు. బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించినా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఏర్పడి ఆందోళనకు నిర్ణయించాయన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 21న డీఈవో కార్యాలయాలు ముట్టడికి పిలుపునిచ్చాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఉపాధ్యాయుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ప్రధానోపాధ్యాయుల సంఘం నుంచి వీఎస్ వేణుగోపాల్‌తోపాటు గోపినాథ్ (పీఆర్‌టీయూ), ఇమంది పైడిరాజు (ఎస్టీయూ), టి.రామకృష్ణ (ఏపీటీఎఫ్- 257), జి.చిన్నబ్బాయ్ (యూటీఎఫ్), ఎ.అరుణ్‌కుమార్ (ఏపీయూఎస్), ఎన్.ధనుంజయరావు (ఏపీటీఎఫ్-1938), బి.చిన్నారావు (ఏపీపీటీఏ), సీహెచ్ సూర్యనారాయణ (వైఎస్సార్‌టీఏ)లను ఎన్నుకున్నారు.

అదృశ్యమైన బాలిక కిడ్నాప్

అనకాపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : బాలిక అదృశ్యం కేసును పట్టణ అనకాపల్లి పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. చిన్నారిని అపహరించిన మహిళతో పాటు ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం వెల్లడించారు. అనకాపల్లిలోని లోకావారివీధికి చెందిన భీశెట్టి హరీశ్, లలిత దంపతులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజూ మాదిరిగానే ఈ నెల 14వ తేదీన కూడా భార్యాభర్తలు కూలి పనులకు వెళ్లిపోయారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి నాలుగేళ్ల చిన్న కుమార్తె లోహిత కనిపించలేదు. ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో 15వ తేదీ సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన చేసిన పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక ఫొటోను వివిధ సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. బాలిక ఇంటి పరిసరాలతోపాటు పలు కూడళ్లల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. 14వ తేదీన పెరుగుబజార్ వద్ద బాలికతో కలిసి ఒక మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కినట్టు గుర్తించారు. ఈమె ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయగా... విశాఖలోని పెదగంట్యాడకు చెందిన టొంటోని లక్ష్మిగా నిర్ధారించారు. ఆమె కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అనకాపల్లిలో నివాసం ఉంటున్న బోనాల దేవి అనే మహిళను కలవడానికి శనివారం ఉదయం లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామి వస్తుండగా జలగలమదుం జంక్షన్ వద్ద పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. వారి వెంట వున్న బాలిక లోహితను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితులను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. బాలికను విక్రయించడానికి లేదా ఇంట్లో పనులు చేయించేందుకు అపహరించి వుంటారని ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.



5వ వార్డులో ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ కనకమహాలక్ష్మి, తదితరులు



సింహగిరిపై దేవస్థానం సిబ్బంది ప్రతిజ్ఞ

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జోన్ -2 కమిషనర్ కనకమహాలక్ష్మి

కొమ్మాది, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత సూచించారు. శనివారం ఆ వార్డులో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పగటి పూట అత్యవసర సమయంలో తప్ప ఎవరూ బయటకు రాకూడదన్నారు. ఎండ తీవ్రతను తట్టుకునేలా టోపీ ధరించాలని, వడదెబ్బ తగలకుండా తరచూ నీరు, జ్యూస్, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకుండా గుడ్డ సంచులు వాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్ఓ కిశోర్, టీడీపీ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, ఓలేటి శ్రావణ్ పాల్గొన్నారు. బక్కన్నపాలెంలోని 16వ పోలీస్ బెటాలియన్ లోనూ స్వచ్ఛతా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ కేవీ మురళీకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్లు నారాయణ, మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల రోగాలు దరి చేరవని సింహాచలం దేవస్థానం ఈఓ సుజాత అన్నారు. సింహగిరిపై మాడవీధుల్లో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అలాగే 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం ఆధ్వర్యంలోనూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు.

భక్తులకు రుచికరమైన భోజనం : ఈఓ



సరకుల నాణ్యతను పరిశీలిస్తున్న ఈఓ సుజాత

సింహాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రుచి, శుచి కలిగిన భోజనం అందించాలని నిత్యాన్న ప్రసాద విభాగం అధికారులను ఈఓ ఎస్. సుజాత ఆదేశించారు. శనివారం ఆమె అన్నప్రసాదం విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 16న దేవదాయ శాఖ కమిషనర్ సారథ్యంలో విజయవాడలో జరిగిన సమావేశంలో అన్నప్రసాదంపై ప్రత్యేక చర్చ జరిగిందన్నారు. అన్నప్రసాదం రుచికరంగా ఉండడమే కాకుండా ప్రసాద విభాగం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.అనంతరం ప్రధాన స్టోర్సు విభాగాన్ని పరిశీలించారు. ప్రసాదాల తయారీకి కొనుగోలు చేసిన ముడి సరుకు శాంపిల్స్‌ను చూశారు. నాణ్యత విషయమై రాజీ పడవద్దని, ల్యాబ్‌లో ఎప్పటికప్పుడు పరీక్షలు జరిపించాలన్నారు. నెయ్యి, జీడిపప్పు, ఇతర సరకులు ఎక్కడ కొనుగోలు చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఆలయం నుంచి బయట వస్తున్న భక్తులు

సింహగిరి కిటకిట

సింహాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది తరలిరావడంతో రద్దీ నెలకొంది. వేసవి సెలవులతో పాటు ఒడిశా ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు సింహగిరిపై ఉండడంతో ఒడిశా నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. వేకువజామున పుష్కరిణిలో స్నానాలు చేసిన తరువాత భైరవస్వామిని దర్శించుకుని సింహగిరికి చేరుకున్నారు. అప్పన్న ఖజానాకు అన్ని విభాగాల ద్వారా మొత్తం రూ.41 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

సేంద్రీయ మామిడి పండ్ల మేళా ప్రారంభం



మేళాలో మామిడి పండ్ల విక్రయాలు

విశాలాక్షినగర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : సేంద్రీయ మామిడి పండ్ల మేళ నగరవాసులకు వినూత్న అనుభూతి కలిగిస్తుందని గో ఆధారిత రైతుల సంఘం జాతీయ నాయకుడు జలగం కుమార్‌స్వామి అన్నారు. 9వ వార్డులోని విశాలాక్షినగర్‌లో ఉన్న బీవీకే కళాశాలలో శనివారం సాయంత్రం రైతు శాస్త్రవేత్త కొంగర రమేశ్, సంఘం అధ్యక్షుడు పీఎల్ఎం రాజుతో కలిసి ఆయన మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో వచ్చే శని, ఆదివారల్లోనూ మేళాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అరుదైన మామిడి రకాలు మేళాలో అందుబాటులో ఉంచామని, రసాయనాలు మిళితం కాకుండా సేంద్రీయంగా పండించినవని పేర్కొన్నారు. రైతు శాస్త్రవేత్త కొంగర రమేశ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని మామిడి రకాలన్నింటినీ ఒకే ఆవరణలో ఉంచడం ఆనందంగా ఉందన్నారు. ప్రాచీన కాలానికి చెందిన పలు రకాలను కాపాడుకోవడానికి మేళాలు దోహదపడతాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మేళాను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేళా ప్రతినిధులు పేరి రామకృష్ణమూర్తి, అశోక్, రుషి, నరేంద్ర, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ స్టేట్ వర్సిటీతో గీతం ఎంఓయూ

సాగర్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని పెన్ స్టేట్ విశ్వవిద్యాలయంతో గీతం వర్సిటీ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పెన్‌స్టేట్ వర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ డేవిడ్ ఎం. కెల్లిజోపెరీజ్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వహీద్‌మోటెవల్లి, గీతం వర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి,డీన్ డాక్టర్ ఎస్‌సీ రావు, బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా పి. పప్పు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ తదితరులు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా గీతం వర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ గౌతమ్‌రావు మాట్లాడుతూ పెన్‌స్టేట్ వర్సిటీతో ఉమ్మడిగా పిజి, యూజి కోర్సులు అందించడానికి ఎంఓయూ కుదిరిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్, సీఎస్ఈ విభాగం అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ శాంతి, జీసీ జీసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

... 5వ పేజీ తరువాయి

అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ సమావేశంలో నాయకులు నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఒకరోజు ఉద్యోగులతో పాటు సమ్మె చేద్దామని నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం ప్లాంటులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా యాజమాన్యంపై ఒత్తిడి పెంచాలనే ఉద్దేశంతో 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఉక్కు కర్మాగారంలో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఇటీవల సుమారు 1,750 మందిని అధికారికంగా తొలగించగా, మరో వెయ్యి మంది వారి కాంట్రాక్టు టెండర్లు పూర్తి కావడంతో విధులకు దూరంగా ఉన్నారు. ప్లాంటులో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించబోమని ప్లాంట్ యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సింహాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన సాధ్యమని రిటైర్డ్ హెచ్ఎం కెఎస్ ఆర్ మూర్తి అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎస్‌వీ నరసింహం సారథ్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం ఆయన పుస్తక పఠనం గురించి వివరించారు. పుస్తక పఠనానికి ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలన్నారు. అనంతరం గ్రంథాలయాధికారి సారథ్యంలో గ్రంథాలయం పరిసరాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు.

మేయర్‌కు 98వ వార్డు కార్పొరేటర్ వినతి

సింహాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పాతగోశాల కూడలి నుంచి పాతఅడివివరం కూడలి వరకు ఉన్న బీఆర్‌టీఎస్ బాధితుల టీడీఆర్ బాండ్లకు సేల్స్ ఆప్షన్ కల్పించాలని కార్పొరేటర్ పివి నరసింహం కోరారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులకు జారీ చేసిన టీడీఆర్‌లకు సేల్స్ ఆప్షన్ లేకపోవడంతో అవి కూడా నిరుపయోగంగా మారాయన్నారు. తక్షణమే సేల్స్ అప్షన్ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీతలహరి

భీమునిపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామయోగి అగ్రహారంలో ఉన్న సద్గురు సేవాశ్రమం 15వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నగరానికి చెందిన ఐఈఎల్ శాస్త్రి సంగీత సమితి అధ్యక్షుడు అకొండి వెంకటరావు, కార్యదర్శి పిల్లా జగన్‌మోహన్‌రావు, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో భక్తి సంగీతలహరి నిర్వహించారు. సాయంత్రం జి.మాడుగుల పంచముఖ హనుమ భజన మండలి ఆధ్వర్యంలో హనుమ సేవా భజన ఘనంగా జరిగింది. ఆశ్రమ నిర్వాహకుడు రాజుస్వామి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

విద్య, వైద్యంలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజ

సాగర్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : విద్య, వైద్యంలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తాండల్వాడ్కర్ అన్నారు. విశాఖపట్నం ప్రసూతి, గైనకాలజికల్ సొసైటీ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని రాడిసన్‌బ్లూ రిసార్ట్‌లో శనివారం రాత్రి ఆమె ప్రెసిడెన్షియల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ రెండు రోజుల సదస్సును ప్రారంభించారు.

మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణ వేగవంతం చేయాలి

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. డీపీఆర్‌కు అనుగుణంగా మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి తుదిచర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంకా రైల్వే, హెచ్‌పీసీఎల్, జలవనరులు, విద్యుత్, ఐఓసీఎల్, జాతీయ రహదారులు, అంతర్గత రోడ్ల విస్తరణ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణలో జాప్యం వద్దన్నారు.



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న మాజీ సైనికులు, నాయకులు

తగరపువలసలో 'సిందూర్' విజయోత్సవ ర్యాలీ

తగరపువలస, మే 17 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కూడలిలో శనివారం సాయంత్రం తిరంగా పేరుతో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గంటా రవితేజ ఈ ర్యాలీని ప్రారంభించారు. వంద అడుగుల జాతీయ జెండాను పురవీధుల్లో ప్రదర్శించారు. అంబేడ్కర్ కూడలి నుంచి తాతా థియేటర్ మీదుగా జాతీయ రహదారి సర్వీసు రోడ్డు వరకు, అక్కడి నుంచి గ్రంథాలయం మీదుగా భీమిలి రహదారి కూడలికి చేరుకుని తిరిగి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీ నాయకులు, మాజీ సైనికులు, యువత పాల్గొన్నారు.

ఏయూ వీసీ రాజశేఖర్‌కు పితృ వియోగం

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ కన్నుమూశారు. గడిచిన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం సాయంత్రం ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. ప్రహ్లాదపురంలోని స్వగృహంలో ఆయన పార్థివ దేహాన్ని ఉంచగా పలువురు శనివారం నివాళులర్పించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్ ధనుంజయరావు, దూర విద్యా కేంద్రం డైరక్టర్ ప్రొఫెసర్ విజయ్ మోహన్, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు, లా కళాశాల ప్రిన్సిపల్ సీతామాణిక్యం, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.పద్మశ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శశిభూషణరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అనంతరం శనివారం మధ్యాహ్నం గోపాలపట్నం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వీడని ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

జనసేనకు చెందిన కోన తాతారావుకు డీసీసీబీ చైర్మన్ పదివిని ఇచ్చినందున భీమిలి నియోజకవర్గానికి న్యాయం చేయాల్సి ఉంది కాబట్టి, యాదవ మహిళనైన తనకు డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించాలని మొల్లి హేమలత విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవి నుంచి తొలగించిన జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక వర్గానికి చెందినవారు కాబట్టి ఆ వర్గానికి తిరిగి ప్రాధాన్యం కల్పించేలా రెండుసార్లు కౌన్సిలర్, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన తనకు అవకాశం ఇవ్వాలని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు కోరుతున్నారు. ఇలా వీరంతా ఎవరికి వారు తమకు అస్మదీయులైన ప్రజాప్రతినిధుల ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం రాత్రి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు మేయర్ కలిసి ఒక హోటల్‌లో సమావేశమై డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ఖరారు చేస్తారని ప్రచారం జరిగింది. అయితే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఈ సమావేశాన్ని ఆదివారానికి వాయిదా వేశారు. జనసేన పార్టీకి ఆగస్టులో ఖాళీ అయ్యే రెండో డిప్యూటీ మేయర్ పదవిని కేటాయిస్తారని ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీ నుంచి డిప్యూటీ మేయర్ పదవికి ఎవరూ పోటీలో లేనట్టేనని అంతా భావించారు. కానీ ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు డిప్యూటీ మేయర్ పదవిని తమకే కేటాయించేలా సీఎం చంద్రబాబుతో మాట్లాడాలని కోరుతూ పార్టీ ఎమ్మెల్సీ హరిప్రసాద్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు శుక్రవారం ఇద్దరు కార్పొరేటర్ల పేర్లతో కూడిన లేఖను పంపించారు. ఇప్పటికే ముగ్గురిలో ఎవరి పేరు ఖరారు చేయాలో తెలియక తలలుపట్టుకుంటున్న టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు జనసేన రూపంలో మరొక చిక్కుముడి వచ్చిపడినట్టయింది. దీంతో డిప్యూటీ మేయర్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇదిలావుండగా టీడీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి వద్ద డిప్యూటీ మేయర్ ఎవరనే విషయాన్ని ప్రస్తావించగా... యాదవ మహిళను మేయర్ పదవి నుంచి తొలగించినందున ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళను డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేయకపోతే పార్టీకి ఆ వర్గం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ఆ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతురాలిని డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేయాలని మెజారిటీ కూటమి ప్రజాప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారని ఆయనన్నారు. మరోవైపు కాపు సామాజిక వర్గం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందున ఆ సామాజిక వర్గానికి ఫ్లోర్ లీడర్ పదవిని అప్పగించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

జనసేన పార్టీని కూడా సంతృప్తిపరిచేందుకు వీలుగా రెండో డిప్యూటీ మేయర్ పదవిని దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ కార్పొరేటర్‌కు ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. దీనివల్ల అన్ని వర్గాలు, పార్టీలను సంతృప్తిపరిచినట్టవుతుందని ఆయన ఆశాభా వం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఆదివారం రాత్రికి డిప్యూటీ మేయర్ ఎవరనే దానిపై ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది.

ఇసుక సరఫరాలో గోల్‌మాల్‌పై కలెక్టర్ ఆరా

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్‌ను హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారి ఒకరు కలిసి వివరాలను నివేదించారు. జేసీ మయూర్ అశోక్‌ను కలిసి పూర్తి వివరాలు నివేదించాలని కలెక్టర్ సూచించడంతో ఆ ఇంజనీరింగ్ అధికారి జేసీని కలిశారు. అయితే దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా క్షేత్ర స్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించే హౌసింగ్ అధికారులు కొందరు భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భారీగా పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు, క్షేత్రస్థాయిలో పనిచేసే పలువురు అధికారులు కలిసి ప్రభుత్వం సరఫరా చేసే ఇసుక, ఐరన్, సిమెంటు నుంచి కొంతమేర పక్కదారి పట్టించారనే ఫిర్యాదులున్నాయి. నాణ్యత లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా సైట్ ఇంజనీర్లను హెచ్చరించే సందర్భాలు ఒక్కటి కూడా లేదు. దీంతో ప్రతిపాదనల్లో పేర్కొన్న సిమెంటులో కొంత మొత్తాన్ని పక్కదారి పట్టించారని, ఇసుక విషయంలోనూ అక్రమాలు జరిగాయని పలు ఫిర్యాదులున్నాయి. గత ఏడాది ప్రభుత్వం మారిన తరువాత ఇసుకకు కొరత ఏర్పడే సమయంలో రీచ్‌ల నుంచి వచ్చే ఇసుకలో కొన్ని లోడ్లను దారిమళ్లించారు. పెద్ద కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయి చిన్నపాటి కాంట్రాక్టర్లకు కేటాయించే ఇసుక సరఫరాలో గోల్‌మాల్ చేశారనే వాదన ఉంది. కాగా అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే ముగ్గురు ఏఈలు సొంతంగా కార్లు వినియోగిస్తుండడం గమనార్హం. హౌసింగ్ కార్పొరేషన్‌లో ఈఈ, డీఈలకు మాత్రమే వాహన సదుపాయం ఉంది.

ఏళ్లతరబడి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అనేకమంది ఏఈలు ద్విచక్ర వాహనం, లేదా ఈఈ/డీఈతోపాటు వాహనాల్లో తిరిగేవారు. అటువంటిది నగర శివార్లలో 98 వేల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో పలు అక్రమాలకు పాల్పడుతున్న ఏఈలు కార్లు వినియోగిస్తుండడంపై జిల్లా స్థాయి అధికారులు ఆరా తీశారు.

దృష్టంతా చలానాలపైనే..

... 5వ పేజీ తరువాయి

సిబ్బంది ఒక గ్రూపుగా ఏర్పడి ఆ రోడ్డులో వచ్చే వాహనాలన్నింటినీ ఆపుతున్నారు. ఒక్కో వాహనంపై పెండింగ్ ఈ-చలానాలు ఎన్ని ఉన్నాయనేది తనిఖీ చేస్తున్నారు. ఒకవేళ ఏదైనా వాహనానికి సంబంధించి పెండింగ్ చలానాలు ఉన్నట్టు తేలితే వారితో అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో ఈ-చలానాల జరిమానాను కట్టించిన తరువాతే వాహనాన్ని విడిచిపెడుతున్నారు. ఇలా అందరూ ట్రాఫిక్ విధులను పక్కన పెట్టేసి ఈ-చలానాలను కట్టించడంలోనే నిమగ్నమవుతుండడంతో కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలు ఇష్టారాజ్యంగా సాగిపోతున్నాయి. దీని వల్ల ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని పలువురు వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులతో పలువురు వాహనచోదకులు వాగ్వాదానికి కూడా దిగుతున్నారు. అయితే తామేమీ చేయలేమని, ఉన్నతాధికారులు చెప్పిన ఆదేశాలను పాటించాల్సిందేనని వారు వాపోతున్నారు. ప్రతిరోజూ 150 చలానాలను కట్టించాలని తమకు టార్గెట్ విధిస్తున్నారని,ఆ లక్ష్యాన్ని అందుకోలేకపోతే శాఖాపరమైన ఇబ్బందులకు తాము గురికావాల్సి వస్తుందని వాహనదారులకు నచ్చచెబుతూ ఈ-చలానాలను ట్రాఫిక్ పోలీసులు కట్టిస్తున్నారు.

హుద్‌హుద్ ఇళ్లను అమ్మేశారు

... 5వ పేజీ తరువాయి

నివాసం ఉంటున్నారు? వారు గతంలో ఆమోదించిన లబ్ధిదారుల జాబితాలో వారు ఉన్నారా? అద్దెకు ఉంటున్నారా? కొనుగోలు చేశారా? అనే కోణంలో విచారణ నిర్వహించారు. పైనాపిల్ కాలనీలో గల హుద్‌హుద్ గృహ సముదాయంలో మొత్తం పది బ్లాకులలో 320 ఇళ్లను నిర్మించారు. విచారణ సమయంలో 51 ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. లబ్ధిదారుల జాబితాలో ఉన్న 163 మంది ఇక్కడ నివాసం ఉంటున్నారు. మరో 26 మంది ఇళ్లను విక్రయించగా, 53 మంది అద్దె ప్రాతిపదికన ఉంటున్నారు. ఇంకా 22 ఇళ్లు ఖాళీగా ఉండగా ఒకరి ఇళ్లు డాక్యుమెంట్లు నకిలీవని తేలింది. మొత్తంగా 180 మంది వరకు స్థానికులు ఉండగా, మరో 106 మంది స్థానికేతరులు ఉన్నారని విచారణలో వెల్లడైంది. ఇందుకు సంబంధించిన నివేదికను జీవీఎంసీ కమిషనర్‌కు మధురవాడ జడ్పీ అందజేశారు. నివేదికలో పేర్కొన్న విధంగా అనర్హులపై చర్యలు తీసుకుంటారా? లేదా అన్నది వేచి చూడాలి.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం రేపు

» జేసీ మయూర్ అశోక్

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశానికి అని ఏర్పాట్లు చేయాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రైసైడింగ్ అధికారి మయూర్ అశోక్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఈ నెల 19న నిర్వహించనున్న డిప్యూటీ మేయర్ ఎన్నికకు చేపడుతున్న ఏర్పాట్లు, ఇందుకోసం తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలను చేసినట్టు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక నిమిత్తం మే 19వ తేదీ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఎన్నికకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు వివరించారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో
రేపటి పీజీఆర్ఎస్ రద్దు

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవికి ఈ నెల 19న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మాత్రమే రద్దు చేస్తున్నట్టు విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ, జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలలో సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జరుగుతుందన్నారు.

ఆంగ్లంలో శ్రీనివాస గౌడ్‌కు ఏయూ డాక్టరేట్



వీసీ రాజశేఖర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న శ్రీనివాస్ గౌడ్

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం అంగ్ల శాస్త్ర పరిశోధక విద్యార్థి వై.శ్రీనివాస గౌడ్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ చేతులు మీదుగా పీహెచ్‌డీ పట్టాను శ్రీనివాస గౌడ్ అందుకున్నారు. వర్సిటీ అంగ్ల విభాగ గౌరవ ఆచార్యులైన ప్రొఫెసర్ పి.రాజేంద్ర కర్మాకర్ పర్యవేక్షణలో శ్రీనివాస్ గౌడ్ పరిశోధనలు చేశారు. 'ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ సెలెక్టివ్ ప్లేయస్ ఆఫ్ మేష్ దత్తానీ' అనే అంశంపై జరిపిన పరిశోధనలకు శ్రీనివాస గౌడ్‌కు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్-3** :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ఉత్సాహంగా తిరంగ ర్యాలీ

» భారత సైనిక దళాలకు జేజేలు
» ఆపరేషన్ సిందూర్ విజయంపై హర్షాతిరేకాలు



తిరంగ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, పలువురు నేతలు, మహిళలు



త్రివర్ణ పతాకం పట్టుకొని ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనం

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన పహల్గాం దాడిలో భారతదేశ విజయోత్సవం పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఎంవీపీ కాలనీలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం వద్ద నుంచి ఎంవీపీ కాలనీపుర వీధుల్లో తిరంగ జెండా ర్యాలీ చేపట్టారు. రెపరెపలాడే జాతీయ తిరంగ జెండాను ప్రతి ఒక్కరూ చేతబూని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పట్టాభిరామ్ తదితరుఉల లు పాల్గొని అమాయక ప్రజల ప్రాణాలను నిష్పక్షపాతంగా తీసిన పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనికులు కొల్లగొట్టి గొప్ప విజయాన్ని సాధించారని, ఇది దేశ ప్రజలంతా గర్వించదగిన విషయమన్నారు. అమాయక ప్రజలపై ఉగ్రవాదులు చేసిన దాడికి భారత సైన్యం సరైన బుద్ధి చెప్పిందని, దీనిని ప్రతి ఒక్కరూ పండుగలా నిర్వహించుకోవాలన్నారు. దేశ ప్రజల రక్షణ కోసం సైనికులు జరిపిన పోరాటాలను అభినందిస్తూ ఈ ర్యాలీని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దేశ రక్షణ కోసం తన బిడ్డలను పంపించిన తల్లిదండ్రులకు శతకోటి వందనాలన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, 15వ వార్డు నాయకులు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు, నేతల నారు గోపి, ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, బైరెడ్డి పోతనరెడ్డి, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన కానిస్టేబుల్



మహిళలను కాపాడిన కానిస్టేబుల్ బషీర్, పోలీసులు

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన ఎంవీపీ కానిస్టేబుల్ బషీర్‌ను పోలీసుల అధికారులు అభినందించారు. శుక్రవారం రాత్రి 35 ఏళ్ల మహిళ కనిపించడం లేదంటూ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. పోలీసులు ప్రాథమిక విచారణ చేస్తుడగా.. రాత్రి పదకొండు గంటలకు కానిస్టేబుల్ బషీర్‌కు ఫోన్ వచ్చింది. పీఎం పాలెం గ్యాస్ గోడౌన్ వద్ద నిర్మాణంలో ఉన్న అయిదు అంతస్థుల భవనం పై నుంచి దూకేస్తానంటూ ఓ మహిళ హల్‌చల్ చేస్తుందంటూ సమాచారం అందించారు. వెంటనే బషీర్ ఈ విషయాన్ని సీఐ మురళికి చెప్పారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి మహిళను రక్షించమని సీఐ చెప్పడంతో కానిస్టేబుల్ బషీర్ అక్కడకు వెళ్లారు. సివిల్ డ్రెస్‌లో అక్కడకు వెళ్లిన బషీర్ ఒక మేస్త్రి సాయంతో ఆమెను కాపాడి బంధువులకు అప్పగించారు. తప్పిపోయిందని ఫిర్యాదులోని మహిళే ఆమె అని పోలీసులు నిర్ధారించుకున్నారు. కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ సందర్భంగా శనివారం బషీర్‌కు అభినందనలు తెలిపారు.

జూలో మూడు రకాల జంతువులకు సంతానోత్పత్తి



ఇండియన్ గ్రే ఊల్ఫ్ కూన (తోడేలు పిల్ల)



బెంగాల్ ఫాక్స్ కూనలు



రింగ్ టైల్డ్ లెమ్యూర్ కూన

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో ఒక తోడేలు పిల్ల, బెంగాల్ జాతికి చెందిన నక్కపిల్ల, ఒక లెమూర్ పిల్ల జన్మించినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అంతరించిపోతున్న తోడేళ్ల షెడ్యూల్-1 జాతికి చెందినవని తెలిపారు.ఈ జాతి తోడేళ్లను 2019లో మైసూరు జూ నుంచి తీసుకొచ్చినట్టు తెలిపారు. అలాగే బెంగాల్ జాతికి చెందిన నక్కపిల్లలను ఢిల్లీ జూ నుంచి జంతు మార్పిడి విధానంలో 2021లో తీసుకొచ్చినట్టు తెలిపారు. మడగాస్కర్ జాతికి చెందిన రింగ్ టైల్డ్ లేమ్యూర్‌ని ఇజ్రాయిల్ జూ నుంచి 2013లో తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ జంతు ప్రదర్శనశాలలో వీటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుని, ఈ జంతువుల సంతానోత్పత్తి కూడా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కొన్ని రోజుల కిందట ఆయా జంతువులకు పిల్లలు పుట్టినట్టు జూ క్యూరేటర్ తెలిపారు.

డీఈవో పుస్తకాల గొడౌన్ పరిశీలన

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా విద్యాశాఖాదికారి ఎన్‌ప్రేమ్‌కుమార్ శనివారం ఉదయం నగరంలో గల క్వీన్ మేరీ పాఠశాలలో గల పుస్తకాల గోడౌన్‌ను పరిశీలించారు. సుమారు 80 శాతం వరకు టెస్ట్ పుస్తకాలు వచ్చినట్టు ఆయన తెలిపారు.

విమ్స్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



విమ్స్‌లో రోగులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న డైరెక్టర్ కె.రాంబాబు, పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో శనివారం రోగులకు మజ్జిగతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విమ్స్‌లో శనివారం చేపట్టరు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డెరెక్టర్ డాక్టర్ రాంబాబు ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల థీమ్ 'బీట్ ద హీట్' కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వచ్చిన రోగులకు వేసవి తాపం నుంచి ఏ విధంగా రక్షించుకోవడంపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విమ్స్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అలాగే జీవీఎంసీ 12వ వార్డులోని నెహ్రూనగర్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రను వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ నాయకులు ఏడువాక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాకాదికారి ఎన్.ప్రేమ్‌కుమార్ స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయంచారు. జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యన్నారాయణ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

» రేపటి నుంచి మూల్యాంకనం
» వచ్చే నెల మొదటవారంలో ఫలితాలు?

మద్దిలపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 93శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 92 శాతం హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు 14,040 మంది విద్యార్థులు రాయగా, 1011 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2063 మంది హాజరవగా, 187మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను సీసీ కెమెమరాల ద్వారా లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షించారు. అలాగే సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. బ్రిడ్జి కోర్సుల విద్యార్థులకు సోమ, మంగళ వారాల్లో 5పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి మూల్యాంకనం

సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాలను సోమవారం నుంచి మూల్యాంకనం నిర్వహిస్తున్నట్టు ఆర్ఐవో మురళీధర్ తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి లక్ష వరకు జవాబుపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయన్నారు. మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయా జవాబుపత్రాల దిద్దుబాటు ఉంటుందని చెప్పారు. మొదటి విడతలో సంస్కృతం, ఆంగ్లం, తెలుగు, హిందీ, గణితం, పౌరశాస్త్రం, రెండో విడతలో ఆర్థికశాస్త్రం, చరిత్ర, కామర్స్, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, బోటనీ, జువాలజీ, బ్రిడ్జి కోర్సుల జవాబు పత్రాలు మూల్యాంకనం జరుగుతుందని వెల్లడించారు.

సబ్జెక్టుల వారీగా అధ్యాపకులు మూల్యాంకనానికి తపనిసరిగా హాజరు కావాలని కోరారు. హాజరు కాని అధ్యాపకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సప్లిమెంటరీ ఫలితాలను వచ్చే నెల మొదట వారంలో విడుదల చేసేందుకు ఇంటర్‌బోర్డు కమిషనరేట్ సన్నహాలు చేస్తోంది. తక్కువ జవాబుపత్రాలే ఉన్నందున వారం పది రోజుల్లో మూల్యాంకనం పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టారు. మూల్యాంకనం ముగిసిన వెంటనే ఒకటి రెండ్రోజుల్లో కంప్యూటర్ వర్క్ చేసి ఫలితాలు విడుదలకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించలేకపోయారు

» శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఎద్దేవా



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన జీవీఎంసీకి నాలుగు నెలలుగా కమిషనర్‌ను నియమించలేకపోయారని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేకేరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న బొత్స అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవీఎంసీ కమిషనర్ లేక నగరంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించినప్పటికీ సాధారణ విధుల ఒత్తిడి ఉండడంతో జీవీఎంసీ కార్యకలాపాలపై దృష్టిపెట్టేందుకు సమయం ఉండడంలేదన్నారు. కనీసం వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినా కొంతవరకు ఉపయోగం ఉండేదని బొత్స అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ బియ్యం రవాణాను పౌరసరఫరాల శాఖ మంత్రి స్వయంగా పట్టుకున్నారని, ఇంతవరకు దానిపై చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వ్యవస్థలను నేతలు చేతుల్లోకి తీసుకోవడం వల్లే వీరయ్య చౌదరి వంటి వారి హత్యలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వం పెన్షన్ రూ. వెయ్యి పెంచి ఇవ్వడం తప్ప ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. పొగాకు రైతులు ఇంతటి దుర్భరమైన పరిస్థితిని గత 20 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదన్నారు. విద్యుత్‌చార్జీలు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వవైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల తరఫున పోరాడాలని పార్టీ సమన్వయసమావేశంలో నిర్ణయించామన్నారు. పార్టీ జిల్లా పరిశీలకులు బాబూరావు మాట్లాడుతూ సమస్యలను పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు మాట్లాడుతూ కూటమి నేతల అక్రమాలను బయటపెట్టాలని పార్టీ కార్యకర్తలను కోరారు.

ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్కేట్ బోర్డింగ్ పార్కు నిర్మాణం

» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్



స్కేటింగ్ క్రీడాకారులతో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పార్కు ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్కేట్ బోర్డింగ్ పార్క్ నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని 2026 నేషనల్ గేమ్స్ నాటికి పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. శనివారం వుడా పార్కులోని స్కేటింగ్ రింక్‌లను పరిశీలించి, కోచ్‌లతో మాట్లాడి వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు గురించి తెలుసుకుని ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వచ్చే ఏడాది జరిగే జాతీయ ఆటల పోటీలకు నిర్వహించేందుకు వీలుగా అన్ని సదుపాయాలతో రింక్ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇందులో భాగంగానే వీఎంఆర్డీఏ ద్వారా రింక్ నిర్మాణం చేస్తున్నామన్నారు.

ఈ క్షేత్రస్థాయి పర్యటనలో చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్ఓ సుజాత శివానీ, ఇంజనీర్ రామరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయిబాబా
అవతార శతజయంతి ఉత్సవాలు



'పవిత్ర యాత్ర- శ్రీసత్యసాయి ప్రేమప్రవాహిని' రథయాత్రకు సిద్ధం చేసిన రథాలు

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి బాబా వారి అవతార శతజయంతి సందర్భంగా స్వామి వారి దివ్య ప్రేమ, శాశ్వత సందేశం దేశవ్యాప్తంగా వ్యాప్తిచెందేలా చేపట్టిన 'పవిత్ర యాత్ర- శ్రీసత్యసాయి ప్రేమవాహిని' రథయాత్రను ఆదివారం నగరంలో నిర్వహించనున్నట్టు శ్రీసత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎస్ నాయుడు, నగర కన్వీనర్ డీవీవీ సీతారామరాజు తెలిపారు. శనివారం ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమ సదన్ వద్ద ఈ ప్రచార రథాలను ప్రదర్శించారు. ఈ సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఆలయం నుంచి బయలుదేరి పెదవాల్తేరు జంక్షన్, శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ జంక్షన్ మీదుగా ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిరం వరకూ సాగుతుందన్నారు. అనంతరం ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు సాయి భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. ఈ రథయాత్రలో భక్తులు, శ్రీసత్యసాయి భజన మండళ్ల కన్వీనర్లు, పదాధికారులు, సిటీ సమితి పదాధికారులు, అన్ని విభాగాలు వారు, బాలవికాస్ పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి తిరంగ యాత్రను విజయవంతం చేయండి

పెదవాల్తేరు, మే 17 : (ఆంధ్రజ్యోతి) ఆపరేషన్ సిందూర్ విజయంతో పాటు భారత సాయుధ దళాల పట్ల పౌరుల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తపరచే ఉద్దేశంతో ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు పార్కు హోటల్ నుంచి ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం వరకూ కూటమి పార్టీలు కలిసి తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు తెలిపారు. ఈ యాత్రలో నగర పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన మీడియో సమావేశంలో జనసేన అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసరావు, బీజేపీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎంఎంఎన్ పరశురామ్‌రాజు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి


కంచరపాలెంలో నినదిస్తున్న ఐటీఐ సిబ్బంది, నాయకులు


డాబాగార్డెన్స్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న శానిటరీ ఉద్యోగులు


మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్క్‌లో పాల్గొన్న జెడ్సీ తదితరులు

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం మొక్కలు నాటారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పచ్చదనం పెంపులో భాగంగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ డీఆర్వో భవానీశంకర్‌లు కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. పరిశుభ్రత చర్యలు చేపట్టారు. వైద్యశిబిరం ఏర్పాటు చేయటంతో అధికారులు, సిబ్బంది ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఉద్యోగులంతా స్వచ్ఛత కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం బయట మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యాలయ రహదారిలో వచ్చిపోయే కార్మికులకు, ఆటోవాలాలకు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి రమణ, మల్లికార్జున్, నారాయణరావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం ఐటీఐలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కార్యక్రమ ప్రాముఖ్యతను తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఐటీఐ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీలో నినదించారు. ఈ కార్యక్రమంలో 54వవార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

మాధవధార: కళింగనగర్ పార్క్‌లో టీడీపీ 51వ వార్డు అధ్యక్షులు ననపల కీర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బందితో కలసి నాయకులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కరపత్రాలు పంచారు. ప్రజలతో కలసి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. జనసేన వార్డు అధ్యక్షుడు గుడివాడ అప్పారావు, టీడీపీ, బీజేపీ నాయకులు హాజరయ్యారు. మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్క్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జోన్-5 జెడ్సీ బి.రాము పరిసరాల పరిశుభ్రతకు పాటించాల్సిన నియమాలతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎంహెచ్‌ఓ సునీల్, శానిటేషన్ అధికారులు, బీజేపీ, టీడీపీ నాయకులు ఎం.వెంకటరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్క్ పరిసరాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43వ వార్డులోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవగాహన ర్యాలీ జరిగింది. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆమె సూచించారు. చెత్తను రోడ్డుపై వేస్తే జీవీఎంసీ అధికారులు జరిమానా విధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్సీ రాము, ఏఎంహెచ్‌వో సునీల్, ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీ రాజశేఖర్‌కు పితృ వియోగం

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ కన్నుమూశారు. గడిచిన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అయన శుక్రవారం సాయంత్రం ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. ప్రహ్లాదపురంలోని స్వగృహంలో ఆయన పార్థివ దేహాన్ని ఉంచగా పలువురు శనివారం నివాళులర్పించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ మోహన్, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు, లా కళాశాల ప్రిన్సిపల్ సీతామాణిక్యం, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.పద్మశ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శశిభూషణరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అనంతరం శనివారం మధ్యాహ్నం గోపాలపట్నం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వడగాడ్పులతో జాగ్రత్త

డాబాగార్డెన్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): వడగాడ్పులకు గురికాకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ 31వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి సూచించారు. శనివారం 31వ వార్డులోని డాబాగార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వడగాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉందని, ప్రజలు నివారణ చర్యలు తెలుసుకోవాలన్నారు. వృద్ధులు, పిల్లలు వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 మధ్య బయట తిరగవద్దని, తేలికపాటి దుస్తులు ధరిస్తూ, సాత్వికాహారం తీసుకోవాలన్నారు. మంచినీటిని ఎక్కువగా తాగడం ద్వారా వడగాడ్పుల ప్రభావం నుంచి బయటపడవచ్చన్నారు. కార్పొరేటర్ బిపిన్ కుమార్, శానిటరీ కార్యదర్శులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కంచరపాలెం:: వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కె.వి.టి.ప్రసాద్ సూచించారు. స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలో గల మర్రిపాలెం అగ్నిమాపక ప్రాంగణంలో శనివారం అవగాహన కల్పించారు. పాదచారులు, వాహనదారులు వడదెబ్బకు గురికాకుండా ఎక్కువగా మంచినీరు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలన్నారు. మండుటెండలో తప్పనిసరి పరిస్థితిలో రావాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి వినియోగించాలన్నారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి పంపిణీ చేశారు. వేసవి కాలం ముగిసే వరకు అగ్నిమాపక కేంద్రం ఆవరణలో చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు.

సీతమ్మధార: ఎండల తీవ్రత దృష్ట్యా వృద్ధులు, పిల్లలు టోపీలు ధరించాలని, మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌లు ఎప్పటికప్పుడు తీసుకోవాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. 23వ వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో 'బీట్ ద హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను, శ్రామికులకు టోపీలు పంపిణీ చేశారు. సహాయ వైద్యాధికారి దుర్గాప్రసాద్, ఎస్ఎస్ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనతో విద్యుత్ ఆదా: ఎస్ఈ శ్యామ్‌బాబు

మురళీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో విద్యుత్ ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.శ్యామ్‌బాబు తెలిపారు. సౌర విద్యుత్‌తో ప్రకృతికి నష్టం వాటిల్లకుండా కరెంట్ బిల్లు ఆదా చేయవచ్చని అన్నారు. శనివారం జోన్-2 పరిధిలోని ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ నుంచి పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నూతన సాంకేతికతతో ప్రయోజనాలను వివరించారు. సబ్ స్టేషన్ నుంచి మాధవధార, కళింగనగర్ ప్రాంతాల మీదుగా బిర్లా జంక్షన్ వరకు సాగిన ర్యాలీలో ఉద్యోగులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జోన్-2 ఈఈ బి.కె.నాయుడుతో కలసి 33/11 కె.వి. ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఆరంభించారు. లోఓల్టేజి సమస్య తీరనుందని ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ జూనియర్ ఇంజనీర్ స్వప్న ప్రియ తెలిపారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి, ఇళ్ల పైకప్పులపై సౌరశక్తి పలకలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవాలని సూచించారు.

కేజీహెచ్‌లో 40 పడకల జనరల్ మెడిసిన్ ప్రత్యేక వార్డు ప్రారంభం

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో 40 పడకలతో ఏర్పాటు చేసిన జనరల్ మెడిసిన్ ప్రత్యేక వార్డును దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అలాగే అత్యవసర విభాగంలో సెంట్రల్ ఎయిర్ కండీషన్‌ను, కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను అనుసంధానిస్తూ ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను కూడా ఆయన ప్రారంభించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేజీహెచ్ అవుట్ గేట్ సమీపంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా దేవి, డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలు సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 9వ తేదీకి సమ్మె వాయిదా

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడినట్టు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. శనివారం వారు సీఐటీయూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు వంటి అంశాలపై ఈనెల 20న సమ్మె చేయాలని నిర్ణయించామని తెలిపారు. కానీ దేశ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేశామన్నారు. కార్మికులు ఈ మార్పును గమనించి, ఈ సమయాన్ని పూర్తిగా ఉపయోగించుకొని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈనెల 20న అన్ని పనిప్రదేశాల్లో గేట్ల వద్ద నిరసనలు చేపట్టాలని చెప్పారు. అలాగే 20న ఉదయం 10 గంటలకు ఆర్‌టీసీ కాంప్లెక్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్, బి. నాగభూషణం, ఎం. మన్మథరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మపేటలో ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్లు

జ్ఞానాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : అచ్చియ్యమ్మపేట గ్రామస్థుల ఆరాధ్య దేవత ఎర్నిమాంబ అమ్మవారి జాతర శనివారం నుంచి ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు తొలేళ్లు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజారి వాసుపల్లి విజయమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సారె సమర్పించారు. సాయంత్రం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు వందకు పైగా అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. ముందుగా ఆలయ ఈఓ సురేశ్ బాబా, కమిటీ సభ్యులు అచ్చియ్యమ్మపేటలో చెట్టు వద్ద ఉన్న పుట్ట మన్ను తీసి అమ్మవారికి సమర్పించారు. అనేక మంది అమ్మవారి మాలధారణ వేసి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో అమ్మవారి ప్రతిమలు పట్టుకొని నడిచారు. ఆదివారం ప్రధాన పండగ జరగనున్నట్టు ఈఓ సురేశ్‌బాబా, తదితరులు తెలిపారు.




అమ్మవారి ప్రతిమల ఊరేగింపు (ఇన్‌సెట్లో) ఎర్నిమాంబ

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి : కలెక్టర్

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై ఆయా శాఖలు సమీక్షించుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు.

నేడు దుర్గమ్మ పండగ

అక్కయ్యపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): మధుసూదన్ నగర్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి సహిత కనకదుర్గ అమ్మవారి 31వ వార్షికోత్సవం ఆదివారం జరగనుందని సేవా సంఘం అధ్యక్షుడు కలిమిరెడ్డి అప్పారావు, ఆలయ కమిటీ చైర్మన్ శీరంశెట్టి శంకరరావు తెలిపారు. ఉదయం 6 నుంచి అమ్మవారికి జలాభిషేకం, క్షీరాభిషేకం, అనంతరం సామూహిక సహస్ర కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 25న మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

అదృశ్యమైన బాలిక కిడ్నాప్

అనకాపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసును అనకాపల్లి పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. చిన్నారిని అపహరించిన మహిళతోపాటు ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. వారి చెర నుంచి బాలికను విడిపించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. అనకాపల్లిలోని లోకావారివీధికి చెందిన భీశెట్టి హరీశ్, లలిత దంపతులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజూ మాదిరిగానే ఈ నెల 14వ తేదీన కూడా భార్యాభర్తలు కూలి పనులకు వెళ్లిపోయారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి నాలుగేళ్ల చిన్న కుమార్తె లోహిత కనిపించలేదు. ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. బంధువులను ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో 15వ తేదీ సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన చేసిన పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక ఫొటోను వివిధ సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. బాలిక ఇంటి పరిసరాలతోపాటు పలు కూడళ్లల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. 14వ తేదీన పెరుగుబజార్ వద్ద బాలికతో కలిసి ఒక మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కినట్టు గుర్తించారు. ఈమె ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయగా... విశాఖలోని పెదగంట్యాడకు చెందిన టొంటోని లక్ష్మిగా నిర్ధారించారు. ఆమె కోసం గాలింపును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అనకాపల్లిలో నివాసం ఉంటున్న బోనాల దేవి అనే మహిళను కలవడానికి శనివారం ఉదయం లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామి అనకాపల్లి వస్తున్నారు. జలగలమదుం జంక్షన్ వద్ద పోలీసులు మాటువేసి ఇద్దరినీ పట్టుకున్నారు. వారి వెంట వున్న బాలిక లోహితను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. బాలికను విక్రయించడానికి లేదా ఇంట్లో పనులు చేయించేందుకు అపహరించి వుంటారని ఎస్పీ తెలిపారు. బాలిక కిడ్నాప్ వ్యవహారంలో ఇంకా ఎవరైనా పాత్ర అయినా ఉందేమోనన్న కోణంలో విచారణ చేపడుతున్నామన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఏఎస్పీ దేవప్రసాద్, అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహనరావు, ఎస్ఐలు దాసరి ఈశ్వరరావు, వెలమల సత్యనారాయణలను ఎస్పీ ప్రశంసించి నగదు రివార్డులను అందజేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.


మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, పోలీసు అధికారులు. ముఖాలకు నల్లటి ముసుగులో వున్న నిందితులు

'లోకావలోకనం' కవితా సంపుటి ఆవిష్కరణ

సీతంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ రచించిన 'లోకావలోకనం' కవితా సంపుటిని శనివారం ఆవిష్కరించారు. డాక్టర్ కె.జి. వేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమాజంలోని వివిధ కోణాలను స్పృశించి కవితాత్మకంగా ఆవిష్కరించిన శేఖరమంత్రి ప్రభాకర్ అభినందనీయులన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న సమాజ రుగ్మతలకు కవిత్వం ఔషధం కావాలన్నారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి గరిమెళ్ల నాగేశ్వరరావు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎం.జ్యోతికుమారి, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, రాచకొండ ఉమాకుమారశాస్త్రి, మాకెన శ్రీనివాస్, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, కొత్తూరు రమణ, పరమేశ్వర రావు, పరవస్తు ఫణిశయన సూరి, ద్విభాష్యం రాజేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, కె.రాంప్రసాద్, జి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్,తదితరులు

21న డీఈవో కార్యాలయం ముట్టడి

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. శనివారం డాబాగార్డెన్‌లో గల ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలతో స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గోపినాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్-117తో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. దీనిని రద్దుచేస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... పాఠశాల విద్యకు మరింత ప్రమాదం తెచ్చేపెట్టేలా జీవో 19, 20, 21లను తీసుకువచ్చి తొమ్మిది రకాల బడులను అమలు చేయడం అన్యాయమన్నారు. బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించినా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఏర్పడి ఆందోళనకు నిర్ణయించాయన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 21న డీఈవో కార్యాలయాలు ముట్టడికి పిలుపునిచ్చాయన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేయాలి: కలెక్టర్

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. డీపీఆర్‌కు అనుగుణంగా మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి తుదిచర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంకా రైల్వే, హెచ్‌పీసీఎల్, జలవనరులు, విద్యుత్, ఐవోసీఎల్, జాతీయ రహదారులు, అంతర్గత రోడ్ల విస్తరణ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణలో జాప్యం వద్దన్నారు. నిర్ణీత సమయంలో భూ సేకరణ చేపట్టి నివేదించాలని స్పష్టం చేశారు. సమీక్షలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత మాధుర్, ఎస్డీసీ సుధాసాగర్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

వీడని ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

జనసేనకు చెందిన కోన తాతారావుకు డీసీసీబీ చైర్మన్ పదవిని ఇచ్చినందున భీమిలి నియోజకవర్గానికి న్యాయం చేయాల్సి ఉంది కాబట్టి, యాదవ మహిళనైన తనకు డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించాలని మొల్లి హేమలత విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవి నుంచి తొలగించిన జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక వర్గానికి చెందినవారు కాబట్టి ఆ వర్గానికి తిరిగి ప్రాధాన్యం కల్పించేలా రెండుసార్లు కౌన్సిలర్, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన తనకు అవకాశం ఇవ్వాలని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు కోరుతున్నారు. ఇలా వీరంతా ఎవరికి వారు తమకు అస్మదీయులైన ప్రజాప్రతినిధుల ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం రాత్రి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు మేయర్ కలిసి ఒక హోటల్‌లో సమావేశమై డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ఖరారు చేస్తారని ప్రచారం జరిగింది. అయితే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఈ సమావేశాన్ని ఆదివారానికి వాయిదా వేశారు. జనసేన పార్టీకి ఆగస్టులో ఖాళీ అయ్యే రెండో డిప్యూటీ మేయర్ పదవిని కేటాయిస్తారని ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీ నుంచి డిప్యూటీ మేయర్ పదవికి ఎవరూ పోటీలో లేనట్టేనని అంతా భావించారు. కానీ ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు డిప్యూటీ మేయర్ పదవిని తమకే కేటాయించేలా సీఎం చంద్రబాబుతో మాట్లాడాలని కోరుతూ పార్టీ ఎమ్మెల్సీ హరిప్రసాద్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు శుక్రవారం ఇద్దరు కార్పొరేటర్ల పేర్లతో కూడిన లేఖను పంపించారు. ఇప్పటికే ముగ్గురిలో ఎవరి పేరు ఖరారు చేయాలో తెలియక తలలుపట్టుకుంటున్న టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు జనసేన రూపంలో మరొక చిక్కుముడి వచ్చిపడినట్టయింది. దీంతో డిప్యూటీ మేయర్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఇదిలావుండగా టీడీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి వద్ద డిప్యూటీ మేయర్ ఎవరనే విషయాన్ని ప్రస్తావించగా... యాదవ మహిళను మేయర్ పదవి నుంచి తొలగించినందున ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళను డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేయకపోతే పార్టీకి ఆ వర్గం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ఆ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతురాలిని డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేయాలని మెజారిటీ కూటమి ప్రజాప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారని ఆయనన్నారు. మరోవైపు కాపు సామాజిక వర్గం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందున ఆ సామాజిక వర్గానికి ఫ్లోర్ లీడర్ పదవిని అప్పగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జనసేన పార్టీని కూడా సంతృప్తి పరిచేందుకు వీలుగా రెండో డిప్యూటీ మేయర్ పదవిని దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ కార్పొరేటర్‌కు ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. దీనివల్ల అన్ని వర్గాలు, పార్టీలను సంతృప్తిపరిచినట్టవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఆదివారం రాత్రికి డిప్యూటీ మేయర్ ఎవరనే దానిపై ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది.

ఇసుక సరఫరాలో గోల్‌మాల్‌పై కలెక్టర్ ఆరా

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్‌ను హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారి ఒకరు కలిసి వివరాలను నివేదించారు. జేసీ మయూర్ అశోక్‌ను కలిసి పూర్తి వివరాలు నివేదించాలని కలెక్టర్ సూచించడంతో ఆ ఇంజనీరింగ్ అధికారి జేసీని కలిశారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించే హౌసింగ్ అధికారులు కొందరు భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భారీగా పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు, క్షేత్రస్థాయిలో పనిచేసే పలువురు అధికారులు కలిసి ప్రభుత్వం సరఫరా చేసే ఇసుక, ఐరన్, సిమెంటు నుంచి కొంత మేర పక్కదారి పట్టించారనే ఫిర్యాదులున్నాయి. నాణ్యత లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా సైట్ ఇంజనీర్లను హెచ్చరించే సందర్భాలు ఒక్కటి కూడా లేదు. దీంతో ప్రతిపాదనల్లో పేర్కొన్న సిమెంటులో కొంత మొత్తాన్ని పక్కదారి పట్టించారని, ఇసుక విషయంలోనూ అక్రమాలు జరిగాయని పలు ఫిర్యాదులున్నాయి. గత ఏడాది ప్రభుత్వం మారిన తరువాత ఇసుకకు కొరత ఏర్పడే సమయంలో రీచ్‌ల నుంచి వచ్చే ఇసుకలో కొన్ని లోడ్లను దారిమళ్లించారు. పెద్ద కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయి చిన్నపాటి కాంట్రాక్టర్లకు కేటాయించే ఇసుక సరఫరాలో గోల్‌మాల్ చేశారనే వాదన ఉంది. అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే ముగ్గురు ఏఈలు సొంతంగా కార్లు వినియోగిస్తుండడం గమనార్హం. హౌసింగ్ కార్పొరేషన్‌లో ఈఈ, డీఈలకు మాత్రమే వాహన సదుపాయం ఉంది. ఏళ్లతరబడి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అనేకమంది ఏఈలు ద్విచక్ర వాహనం, లేదా ఈఈ/డీఈతోపాటు వాహనాల్లో తిరిగేవారు. అటువంటిది నగర శివార్లలో 98 వేల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో అక్రమాలకు పాల్పడుతున్న ఏఈలు కార్లు వినియోగిస్తుండడంపై అధికారులు ఆరా తీశారు.

20 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

... 5వ పేజీ తరువాయి

అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ సమావేశంలో నాయకులు నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఒకరోజు ఉద్యోగులతో పాటు సమ్మె చేద్దామని నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం ప్లాంటులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా యాజమాన్యంపై ఒత్తిడి పెంచాలనే ఉద్దేశంతో 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఉక్కు కర్మాగారంలో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఇటీవల సుమారు 1,750 మందిని అధికారికంగా తొలగించగా, మరో వెయ్యి మంది వారి కాంట్రాక్టు టెండర్లు పూర్తి కావడంతో విధులకు దూరంగా ఉన్నారు. ప్లాంటులో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించబోమని ప్లాంట్ యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.

దృష్టంతా చలానాలపైనే..

... 5వ పేజీ తరువాయి

సిబ్బంది ఒక గ్రూపుగా ఏర్పడి ఆ రోడ్డులో వచ్చే వాహనాలన్నింటినీ ఆపుతున్నారు. ఒక్కో వాహనంపై పెండింగ్ ఈ-చలానాలు ఎన్ని ఉన్నాయనేది తనిఖీ చేస్తున్నారు. ఒకవేళ ఏదైనా వాహనానికి సంబంధించి పెండింగ్ చలానాలు ఉన్నట్టు తేలితే వారితో అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో ఈ-చలానాల జరిమానాను కట్టించిన తరువాతే వాహనాన్ని విడిచిపెడుతున్నారు. ఇలా అందరూ ట్రాఫిక్ విధులను పక్కన పెట్టేసి ఈ-చలానాలను కట్టించడంలోనే నిమగ్నమవుతుండడంతో కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలు ఇష్టారాజ్యంగా సాగిపోతున్నాయి. దీని వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులతో పలువురు వాహనచోదకులు వాగ్వాదానికి కూడా దిగుతున్నారు. అయితే తామేమీ చేయలేమని, ఉన్నతాధికారులు చెప్పిన ఆదేశాలను పాటించాల్సిందేనని వారు వాపోతున్నారు. ప్రతి రోజూ 150 చలానాలను కట్టించాలని తమకు టార్గెట్ విధిస్తున్నారని, ఆ లక్ష్యాన్ని అందుకోలేకపోతే శాఖాపరమైన ఇబ్బందులకు తాము గురికావాల్సి వస్తుందని వాహనదారులకు నచ్చచెబుతూ ఈ-చలానాలను ట్రాఫిక్ పోలీసులు కట్టిస్తున్నారు.

హుద్‌హుద్ ఇళ్లను అమ్మేశారు

... 5వ పేజీ తరువాయి

నివాసం ఉంటున్నారు? వారు గతంలో ఆమోదించిన లబ్ధిదారుల జాబితాలో వారు ఉన్నారా? అద్దెకు ఉంటున్నారా? కొనుగోలు చేశారా? అనే కోణంలో విచారణ నిర్వహించారు. పైనాపిల్ కాలనీలో గల హుద్‌హుద్ గృహ సముదాయంలో మొత్తం పది బ్లాకులలో 320 ఇళ్లను నిర్మించారు. విచారణ సమయంలో 51 ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. లబ్ధిదారుల జాబితాలో ఉన్న 163 మంది ఇక్కడ నివాసం ఉంటున్నారు. మరో 26 మంది ఇళ్లను విక్రయించగా, 53 మంది అద్దె ప్రాతిపదికన ఉంటున్నారు. ఇంకా 22 ఇళ్లు ఖాళీగా ఉండగా ఒకరి ఇళ్ల డాక్యుమెంట్లు నకిలీవని తేలింది. మొత్తంగా 180 మంది వరకు స్థానికులు ఉండగా, మరో 106 మంది స్థానికేతరులు ఉన్నారని విచారణలో వెల్లడైంది. ఇందుకు సంబంధించిన నివేదికను జీవీఎంసీ కమిషనర్‌కు మధురవాడ జోనల్ కమిషనర్ అందజేశారు. నివేదికలో పేర్కొన్న విధంగా అనర్హులపై చర్యలు తీసుకుంటారా? లేదా అన్నది వేచి చూడాలి.

ఉత్సాహంగా తిరంగ ర్యాలీ

» భారత సైనిక దళాలకు జేజేలు
» ఆపరేషన్ సిందూర్ విజయంపై హర్షాతిరేకాలు



తిరంగ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, పలువురు నేతలు, మహిళలు



త్రివర్ణ పతాకం పట్టుకొని ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనం

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన పహల్గాం దాడిలో భారతదేశ విజయోత్సవం పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఎంవీపీ కాలనీలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం వద్ద నుంచి ఎంవీపీ కాలనీ పుర వీధుల్లో తిరంగ జెండా ర్యాలీ చేపట్టారు. రెపరెపలాడే జాతీయ తిరంగ జెండాను ప్రతి ఒక్కరూ చేతబూని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పట్టాభిరామ్ తదితరుఉల లు పాల్గొని అమాయక ప్రజల ప్రాణాలను నిష్పక్షపాతంగా తీసిన పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనికులు కొల్లగొట్టి గొప్ప విజయాన్ని సాధించారని, ఇది దేశ ప్రజలంతా గర్వించదగిన విషయమన్నారు. అమాయక ప్రజలపై ఉగ్రవాదులు చేసిన దాడికి భారత సైన్యం సరైన బుద్ధి చెప్పిందని, దీనిని ప్రతి ఒక్కరూ పండుగలా నిర్వహించుకోవాలన్నారు. దేశ ప్రజల రక్షణ కోసం సైనికులు జరిపిన పోరాటాలను అభినందిస్తూ ఈ ర్యాలీని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దేశ రక్షణ కోసం తన బిడ్డలను పంపించిన తల్లిదండ్రులకు శతకోటి వందనాలన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, 15వ వార్డు నాయకులు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు, నేతల నారు గోపి, ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, భైరెడ్డి పోతనరెడ్డి, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం రేపు

» జేసీ మయూర్ అశోక్

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశానికి అని ఏర్పాట్లు చేయాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఈ నెల 19న నిర్వహించనున్న డిప్యూటీ మేయర్ ఎన్నికకు చేపడుతున్న ఏర్పాట్లు, ఇందుకోసం తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలను చేసినట్టు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక నిమిత్తం మే 19వ తేదీ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఎన్నికకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు వివరించారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో

రేపటి పీజీఆర్ఎస్ రద్దు

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవికి ఈ నెల 19న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మాత్రమే రద్దు చేస్తున్నట్టు విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ, జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలలో సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జరుగుతుందన్నారు.

ఆంగ్లంలో శ్రీనివాస గౌడ్‌కు ఏయూ డాక్టరేట్



వీసీ రాజశేఖర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న శ్రీనివాస్ గౌడ్

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల శాస్త్ర పరిశోధక విద్యార్థి వై.శ్రీనివాస గౌడ్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ చేతులు మీదుగా పీహెచ్‌డీ పట్టాను శ్రీనివాస గౌడ్ అందుకున్నారు. వర్సిటీ ఆంగ్ల విభాగ గౌరవ ఆచార్యులైన ప్రొఫెసర్ పి.రాజేంద్ర కర్మాకర్ పర్యవేక్షణలో శ్రీనివాస్ గౌడ్ పరిశోధనలు చేశారు. 'ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ సెలెక్టివ్ ప్లేయస్ ఆఫ్ మేష్ దత్తానీ' అనే అంశంపై జరిపిన పరిశోధనలకు శ్రీనివాస గౌడ్‌కు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్-3** :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 22, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 34, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన కానిస్టేబుల్



మహిళలను కాపాడిన కానిస్టేబుల్ బషీర్, పోలీసులు

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన ఎంవీపీ కానిస్టేబుల్ బషీర్‌ను పోలీసుల అధికారులు అభినందించారు. శుక్రవారం రాత్రి 35 ఏళ్ల మహిళ కనిపించడం లేదంటూ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. పోలీసులు ప్రాథమిక విచారణ చేస్తుడగా.. రాత్రి పదకొండు గంటలకు కానిస్టేబుల్ బషీర్‌కు ఫోన్ వచ్చింది. వీఎం పాలెం గ్యాస్ గోడౌన్ వద్ద నిర్మాణంలో ఉన్న అయిదు అంతస్తుల భవనం పై నుంచి దూకేస్తానంటూ ఓ మహిళ హల్‌చల్ చేస్తుందంటూ సమాచారం అందించారు. వెంటనే బషీర్ ఈ విషయాన్ని సీఐ మురళికి చెప్పారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి మహిళను రక్షించమని సీఐ చెప్పడంతో కానిస్టేబుల్ బషీర్ అక్కడకు వెళ్లారు. సివిల్ డ్రెస్‌లో అక్కడకు వెళ్లిన బషీర్ ఒక మేస్త్రి సాయంతో ఆమెను కాపాడి బంధువులకు అప్పగించారు. తప్పిపోయిందని ఫిర్యాదులోని మహిళే ఆమె అని పోలీసులు నిర్ధారించుకున్నారు. కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ సందర్భంగా శనివారం బషీర్‌కు అభినందనలు తెలిపారు.

జూలో మూడు రకాల జంతువులకు సంతానోత్పత్తి



ఇండియన్ గ్రే ఊల్ఫ్ కూన (తోడేలు పిల్ల)



బెంగాల్ ఫాక్స్ కూనలు



రింగ్ టైల్డ్ లెమ్యూర్ కూన

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో ఒక తోడేలు పిల్ల, బెంగాల్ జాతికి చెందిన నక్కపిల్ల, ఒక లెమూర్ పిల్ల జన్మించినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అంతరించిపోతున్న తోడేళ్ల షెడ్యూల్-1 జాతికి చెందినవని తెలిపారు.ఈ జాతి తోడేళ్లను 2019లో మైసూరు జూ నుంచి తీసుకొచ్చినట్టు తెలిపారు. అలాగే బెంగాల్ జాతికి చెందిన నక్కపిల్లలను ఢిల్లీ జూ నుంచి జంతు మార్పిడి విధానంలో 2021లో తీసుకొచ్చినట్టు తెలిపారు. మడగాస్కర్ జాతికి చెందిన రింగ్ టైల్డ్ లేమ్యూర్‌ని ఇజ్రాయిల్ జూ నుంచి 2013లో తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ జంతు ప్రదర్శనశాలలో వీటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుని, ఈ జంతువుల సంతానోత్పతి కూడా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కొన్ని రోజుల కిందట ఆయా జంతువులకు పిల్లలు పుట్టినట్టు జూ క్యూరేటర్ తెలిపారు.

డీఈవో పుస్తకాల గొడౌన్ పరిశీలన

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా విద్యాశాఖాదికారి ఎన్‌ప్రేమ్‌కుమార్ శనివారం ఉదయం నగరంలో గల క్వీన్ మేరీ పాఠశాలలో గల పుస్తకాల గోడౌన్‌ను పరిశీలించారు. సుమారు 80 శాతం వరకు టెస్ట్ పుస్తకాలు వచ్చినట్టు ఆయన తెలిపారు.

విమ్స్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో శనివారం రోగులకు మజ్జిగతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విమ్స్‌లో శనివారం చేపట్టరు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డెరెక్టర్ డాక్టర్ రాంబాబు ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల థీమ్ 'బీట్ ద హీట్' కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వచ్చిన రోగులకు వేసవి తాపం నుంచి ఏ విధంగా రక్షించుకోవడంపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విమ్స్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



విమ్స్‌లో రోగులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న డైరెక్టర్ కె.రాంబాబు, పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అలాగే జీవీఎంసీ 12వ వార్డులోని నెహ్రూనగర్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రను వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ నాయకులు ఏడువాక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాకాదికారి ఎన్.ప్రేమ్‌కుమార్ స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయంచారు. జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యన్నారాయణ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

» రేపటి నుంచి మూల్యాంకనం
» వచ్చే నెల మొదటవారంలో ఫలితాలు?

మద్దిలపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 93శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 92 శాతం హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు 14,040 మంది విద్యార్థులు రాయగా, 1011 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2063 మంది హాజరవగా, 187మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను సీసీ కెమెమరాల ద్వారా లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షించారు. అలాగే సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. బ్రిడ్జి కోర్సుల విద్యార్థులకు సోమ, మంగళ వారాల్లో 5పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి మూల్యాంకనం

సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాలను సోమవారం నుంచి మూల్యాంకనం నిర్వహిస్తున్నట్టు ఆర్ఐవో మురళీధర్ తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి లక్ష వరకు జవాబుపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయన్నారు. మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయా జవాబుపత్రాల దిద్దుబాటు ఉంటుందని చెప్పారు. మొదటి విడతలో సంస్కృతం, ఆంగ్లం, తెలుగు, హిందీ, గణితం, పౌరశాస్త్రం, రెండో విడతలో ఆర్థికశాస్త్రం, చరిత్ర, కామర్స్, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, బోటనీ, జువాలజీ, బ్రిడ్జి కోర్సుల జవాబు పత్రాలు మూల్యాంకనం జరుగుతుందని వెల్లడించారు.

సబ్జెక్టుల వారీగా అధ్యాపకులు మూల్యాంకనానికి తపనిసరిగా హాజరు కావాలని కోరారు. హాజరు కాని అధ్యాపకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సప్లిమెంటరీ ఫలితాలను వచ్చే నెల మొదట వారంలో విడుదల చేసేందుకు ఇంటర్‌బోర్డు కమిషనరేట్ సన్నహాలు చేస్తోంది. తక్కువ జవాబుపత్రాలే ఉన్నందున వారం పది రోజుల్లో మూల్యాంకనం పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టారు. మూల్యాంకనం ముగిసిన వెంటనే ఒకటి రెండ్రోజుల్లో కంప్యూటర్ వర్క్ చేసి ఫలితాలు విడుదలకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించలేకపోయారు

» శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఎద్దేవా



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన జీవీఎంసీకి నాలుగు నెలలుగా కమిషనర్‌ను నియమించలేకపోయారని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేకేరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న బొత్స అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవీఎంసీ కమిషనర్ లేక నగరంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించినప్పటికీ సాధారణ విధుల ఒత్తిడి ఉండడంతో జీవీఎంసీ కార్యకలాపాలపై దృష్టిపెట్టేందుకు సమయం ఉండడంలేదన్నారు. కనీసం వీఎంఆర్డీఏ కమిషనర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినా కొంతవరకు ఉపయోగం ఉండేదని బొత్స అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ బియ్యం రవాణాను పౌరసరఫరాల శాఖ మంత్రి స్వయంగా పట్టుకున్నారని, ఇంతవరకు దానిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వ్యవస్థలను నేతలు చేతుల్లోకి తీసుకోవడం వల్లే వీరయ్య చౌదరి వంటి వారి హత్యలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వం పెన్షన్ రూ. వెయ్యి పెంచి ఇవ్వడం తప్ప ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. పొగాకు రైతులు ఇంతటి దుర్భరమైన పరిస్థితిని గత 20 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదన్నారు. విద్యుత్‌ఛార్జీలు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వవైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల తరఫున పోరాడాలని పార్టీ సమన్వయసమావేశంలో నిర్ణయించామన్నారు. పార్టీ జిల్లా పరిశీలకులు బాబూరావు మాట్లాడుతూ సమస్యలను పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు మాట్లాడుతూ కూటమి నేతల అక్రమాలను బయటపెట్టాలని పార్టీ కార్యకర్తలను కోరారు.

ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్కేట్ బోర్డింగ్ పార్కు నిర్మాణం

» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్



స్కేటింగ్ క్రీడాకారులతో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పార్కు ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్కేట్ బోర్డింగ్ పార్క్ నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని 2026 నేషనల్ గేమ్స్ నాటికి పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. శనివారం వుడా పార్కులోని స్కేటింగ్ రింక్‌లను పరిశీలించి, కోచ్‌లతో మాట్లాడి వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు గురించి తెలుసుకుని ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వచ్చే ఏడాది జరిగే జాతీయ ఆటల పోటీలకు నిర్వహించేందుకు వీలుగా అన్ని సదుపాయాలతో రింక్ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇందులో భాగంగానే వీఎంఆర్డీఏ ద్వారా రింక్ నిర్మాణం చేస్తున్నామన్నారు.

ఈ క్షేత్రస్థాయి పర్యటనలో చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్ఓ సుజాత శివానీ, ఇంజనీర్ రామరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయిబాబా

అవతార శతజయంతి ఉత్సవాలు



'పవిత్ర యాత్ర- శ్రీసత్యసాయి ప్రేమప్రవాహిని' రథయాత్రకు సిద్ధం చేసిన రథాలు

వెంకోజీపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి బాబా వారి అవతార శతజయంతి సందర్భంగా స్వామి వారి దివ్య ప్రేమ, శాశ్వత సందేశం దేశ వ్యాప్తంగా వ్యాప్తిచెందేలా చేపట్టిన 'పవిత్ర యాత్ర- శ్రీసత్యసాయి ప్రేమ వాహిని' రథయాత్రను ఆదివారం నగరంలో నిర్వహించనున్నట్టు శ్రీసత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు వీఆర్ఎస్ఎస్ నాయుడు, నగర కన్వీనర్ డీవీవీ సీతారామరాజు తెలిపారు. శనివారం ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమ సదన్ వద్ద ఈ ప్రచార రథాలను ప్రదర్శించారు. ఈ సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఆలయం నుంచి బయలుదేరి పెదవాల్తేరు జంక్షన్, శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ జంక్షన్ మీదుగా ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమసదన్ మందిరం వరకూ సాగుతుందన్నారు. అనంతరం ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు సాయి భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. ఈ రథయాత్రలో భక్తులు, శ్రీసత్యసాయి భజన మండళ్ల కన్వీనర్లు, పదాధికారులు, సిటీ సమితి పదాధికారులు, అన్ని విభాగాలు వారు, బాలవికాస్ పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి తిరంగ యాత్రను విజయవంతం చేయండి

పెదవాల్తేరు, మే 17 : (ఆంధ్రజ్యోతి) ఆపరేషన్ సిందూర్ విజయంతో పాటు భారత సాయుధ దళాల పట్ల పౌరుల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తపరచే ఉద్దేశంతో ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు పార్కు హోటల్ నుంచి ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం వరకూ కూటమి పార్టీలు కలిసి తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు తెలిపారు. ఈ యాత్రలో నగర పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జనసేన అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసరావు, బీజేపీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎంఎంఎస్ పరశురామ్‌రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి


కంచరపాలెంలో నినదిస్తున్న ఐటీఐ సిబ్బంది, నాయకులు


డాబాగార్డెన్స్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న శానిటరీ ఉద్యోగులు


మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్క్‌లో పాల్గొన్న జెడ్సీ తదితరులు

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం మొక్కలు నాటారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పచ్చదనం పెంపులో భాగంగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ డీఆర్‌వో భవానీశంకర్‌లు కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. పరిశుభ్రత చర్యలు చేపట్టారు. వైద్యశిబిరం ఏర్పాటు చేయటంతో అధికారులు, సిబ్బంది ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఉద్యోగులంతా స్వచ్ఛత కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం బయట మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యాలయ రహదారిలో వచ్చిపోయే కార్మికులకు, ఆటోవాలాలకు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి రమణ, మల్లికార్జున్, నారాయణరావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా


కలెక్టర్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం ఐటీఐలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కార్యక్రమ ప్రాముఖ్యతను తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఐటీఐ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీలో నినదించారు. ఈ కార్యక్రమంలో 54వవార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాధవధార: కళింగనగర్ పార్క్‌లో టీడీపీ 51వ వార్డు అధ్యక్షులు సనపల కీర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బందితో కలసి నాయకులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కరపత్రాలు పంచారు. ప్రజలతో కలసి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. జనసేన వార్డు అధ్యక్షుడు గుడివాడ అప్పారావు, టీడీపీ, బీజేపీ నాయకులు హాజరయ్యారు. మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్క్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జోన్-5 జెడ్సీ బి.రాము పరిసరాల పరిశుభ్రతకు పాటించాల్సిన నియమాలతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎంహెచ్ఓ సునీల్, శానిటేషన్ అధికారులు, బీజేపీ, టీడీపీ నాయకులు ఎం.వెంకటరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్క్ పరిసరాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43వ వార్డులోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవగాహన ర్యాలీ జరిగింది. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆమె సూచించారు. చెత్తను రోడ్డుపై వేస్తే జీవీఎంసీ అధికారులు జరిమానా విధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్సీ రాము, ఏఎంహెచ్‌వో సునీల్, ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీ రాజశేఖర్‌కు పితృ వియోగం

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ కన్నుమూశారు. గడిచిన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం సాయంత్రం ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. ప్రహ్లాదపురంలోని స్వగృహంలో ఆయన పార్థివ దేహాన్ని ఉంచగా పలువురు శనివారం నివాళులర్పించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్ ధనుంజయరావు, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ మోహన్, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు, లా కళాశాల ప్రిన్సిపల్ సీతామాణిక్యం, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.పద్మశ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శశిభూషణరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అనంతరం శనివారం మధ్యాహ్నం గోపాలపట్నం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వడగాడ్పులతో జాగ్రత్త

డాబాగార్డెన్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): వడగాడ్పులకు గురికాకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ 31వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి సూచించారు. శనివారం 31వ వార్డులోని డాబాగార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వడగాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉందని, ప్రజలు నివారణ చర్యలు తెలుసుకోవాలన్నారు. వృద్ధులు, పిల్లలు వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 మధ్య బయట తిరగవద్దని, తేలికపాటి దుస్తులు ధరిస్తూ, సాత్వికాహారం తీసుకోవాలన్నారు. మంచినీటిని ఎక్కువగా తాగడం ద్వారా వడగాడ్పుల ప్రభావం నుంచి బయటపడవచ్చన్నారు. కార్పొరేటర్ బిపిన్ కుమార్, శానిటరీ కార్యదర్శులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కంచరపాలెం:: వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కె.వి.టి.ప్రసాద్ సూచించారు. స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలో గల మర్రిపాలెం అగ్నిమాపక ప్రాంగణంలో శనివారం అవగాహన కల్పించారు. పాదచారులు, వాహనదారులు వడదెబ్బకు గురికాకుండా ఎక్కువగా మంచినీరు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలన్నారు. మండుటెండలో తప్పనిసరి పరిస్థితిలో రావాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి వినియోగించాలన్నారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి పంపిణీ చేశారు. వేసవి కాలం ముగిసే వరకు అగ్నిమాపక కేంద్రం ఆవరణలో చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు.

సీతమ్మధార: ఎండల తీవ్రత దృష్ట్యా వృద్ధులు, పిల్లలు టోపీలు ధరించాలని, మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌లు ఎప్పటికప్పుడు తీసుకోవాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. 23వ వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో 'బీట్ ద హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను, శ్రామికులకు టోపీలు పంపిణీ చేశారు. సహాయ వైద్యాధికారి దుర్గాప్రసాద్, ఎస్ఎస్ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనతో విద్యుత్ ఆదా: ఎస్ఈ శ్యామ్‌బాబు

మురళీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో విద్యుత్ ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.శ్యామ్‌బాబు తెలిపారు. సౌర విద్యుత్‌తో ప్రకృతికి నష్టం వాటిల్లకుండా కరెంట్ బిల్లు ఆదా చేయవచ్చని అన్నారు. శనివారం జోన్-2 పరిధిలోని ఎస్ఎస్టీఎల్ సెక్షన్ నుంచి పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నూతన సాంకేతికతతో ప్రయోజనాలను వివరించారు. సబ్ స్టేషన్ నుంచి మాధవధార, కళింగనగర్ ప్రాంతాల మీదుగా బిర్లా జంక్షన్ వరకు సాగిన ర్యాలీలో ఉద్యోగులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జోన్-2 ఈఈ బి.కె.నాయుడుతో కలసి 33/11 కె.వి. ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ఆరంభించారు. లోఓల్టేజి సమస్య తీరనుందని ఎస్ఎస్టీఎల్ సబ్‌స్టేషన్ జూనియర్ ఇంజనీర్ స్వప్న ప్రియ తెలిపారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి, ఇళ్ల పైకప్పులపై సౌరశక్తి పలకలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవాలని సూచించారు.

కేజీహెచ్‌లో 40 పడకల జనరల్ మెడిసిన్ ప్రత్యేక వార్డు ప్రారంభం

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో 40 పడకలతో ఏర్పాటు చేసిన జనరల్ మెడిసిన్ ప్రత్యేక వార్డును దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అలాగే అత్యవసర విభాగంలో సెంట్రల్ ఎయిర్ కండీషన్‌ను, కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను అనుసంధానిస్తూ ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను కూడా ఆయన ప్రారంభించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేజీహెచ్ అవుట్ గేట్ సమీపంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా దేవి, డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలు సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 9వ తేదీకి సమ్మె వాయిదా

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడినట్టు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. శనివారం వారు సీఐటీయూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు వంటి అంశాలపై ఈనెల 20న సమ్మె చేయాలని నిర్ణయించామని తెలిపారు. కానీ దేశ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేశామన్నారు. కార్మికులు ఈ మార్పును గమనించి, ఈ సమయాన్ని పూర్తిగా ఉపయోగించుకొని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈనెల 20న అన్ని పనిప్రదేశాల్లో గేట్ల వద్ద నిరసనలు చేపట్టాలని చెప్పారు. అలాగే 20న ఉదయం 10 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్, బి.నాగభూషణం, ఎం. మన్మథరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మపేటలో ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్లు

జ్ఞానాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : అచ్చియ్యమ్మపేట గ్రామస్తుల ఆరాధ్య దేవత ఎర్నిమాంబ అమ్మవారి జాతర శనివారం నుంచి ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు తొలేళ్లు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజారి వాసుపల్లి విజయమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సారె సమర్పించారు. సాయంత్రం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు వందకు పైగా అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. ముందుగా ఆలయ ఈఓ సురేశ్‌బాబా, కమిటీ సభ్యులు అచ్చియ్యమ్మపేటలో చెట్టు వద్ద ఉన్న పుట్ట మన్ను తీసి అమ్మవారికి సమర్పించారు. అనేక మంది అమ్మవారి మాలధారణ వేసి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో అమ్మవారి ప్రతిమలు పట్టుకొని నడిచారు. ఆదివారం ప్రధాన పండగ జరగనున్నట్టు ఈఓ సురేశ్‌బాబా, తదితరులు తెలిపారు.



అమ్మవారి ప్రతిమల ఊరేగింపు (ఇన్‌సెట్లో) ఎర్నిమాంబ

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి : కలెక్టర్

మహారాణిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై ఆయా శాఖలు సమీక్షించుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు.

నేడు దుర్గమ్మ పండగ

అక్కయ్యపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): మధుసూదన్ నగర్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి సహిత కనకదుర్గ అమ్మవారి 31వ వార్షికోత్సవం ఆదివారం జరగనుందని సేవా సంఘం అధ్యక్షుడు కలిమిరెడ్డి అప్పారావు, ఆలయ కమిటీ చైర్మన్ శీరంశెట్టి శంకరరావు తెలిపారు. ఉదయం 6 నుంచి అమ్మవారికి జలాభిషేకం, క్షీరాభిషేకం, అనంతరం సామూహిక సహస్ర కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 25న మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

అదృశ్యమైన బాలిక కిడ్నాప్

అనకాపల్లి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసును అనకాపల్లి పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. చిన్నారిని అపహరించిన మహిళతోపాటు ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. వారి చెర నుంచి బాలికను విడిపించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. అనకాపల్లిలోని లోకావారివీధికి చెందిన భీశెట్టి హరీశ్, లలిత దంపతులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజూ మాదిరిగానే ఈ నెల 14వ తేదీన కూడా భార్యాభర్తలు కూలి పనులకు వెళ్లిపోయారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి నాలుగేళ్ల చిన్న కుమార్తె లోహిత కనిపించలేదు. ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. బంధువులను ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో 15వ తేదీ సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన చేసిన పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక ఫొటోను వివిధ సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. బాలిక ఇంటి పరిసరాలతోపాటు పలు కూడళ్లల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. 14వ తేదీన పెరుగుబజార్ వద్ద బాలికతో కలిసి ఒక మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కినట్టు గుర్తించారు. ఈమె ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయగా... విశాఖలోని పెదగంట్యాడకు చెందిన టొంటోని లక్ష్మిగా నిర్ధారించారు. ఆమె కోసం గాలింపును ముమ్మరం చేశారు.


మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, పోలీసు అధికారులు. ముఖాలకు నల్లటి ముసుగులో వున్న నిందితులు

ఈ క్రమంలో అనకాపల్లిలో నివాసం ఉంటున్న బోనాల దేవి అనే మహిళను కలవడానికి శనివారం ఉదయం లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామి అనకాపల్లి వస్తున్నారు. జలగల మదుం జంక్షన్ వద్ద పోలీసులు మాటువేసి ఇద్దరినీ పట్టుకున్నారు. వారి వెంట వున్న బాలిక లోహితను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. బాలికను విక్రయించడానికి లేదా ఇంట్లో పనులు చేయించేందుకు అపహరించి వుంటారని ఎస్పీ తెలిపారు. బాలిక కిడ్నాప్ వ్యవహారంలో ఇంకా ఎవరైనా పాత్ర అయినా ఉందేమోనన్న కోణంలో విచారణ చేపడుతున్నామన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఏఎస్పీ దేవప్రసాద్, అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహనరావు, ఎస్ఐలు దాసరి ఈశ్వరరావు, వెలమల సత్యనారాయణలను ఎస్పీ ప్రశంసించి నగదు రివార్డులను అందజేశారు. నింతులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

'లోకావలోకనం' కవితా సంపుటి ఆవిష్కరణ

సీతంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ రచించిన 'లోకావలోకనం' కవితా సంపుటిని శనివారం ఆవిష్కరించారు. డాక్టర్ కె.జి. వేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమాజంలోని వివిధ కోణాలను స్పృశించి కవితాత్మకంగా ఆవిష్కరించిన శేఖరమంత్రి ప్రభాకర్ అభినందనీయులన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న సమాజ రుగ్మతలకు కవిత్వం ఔషధం కావాలన్నారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి గరిమెళ్ల నాగేశ్వరరావు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎం.జ్యోతికుమారి, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, రాచకొండ ఉమాకుమారశాస్త్రి, మాకెన శ్రీనివాస్, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, కొత్తూరు రమణ, పరమేశ్వర రావు, పరవస్తు ఫణిశయన సూరి, ద్విభాష్యం రాజేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, కె.రాంప్రసాద్, జి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్,తదితరులు

21న డీఈవో కార్యాలయం ముట్టడి

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. శనివారం డాబాగార్డెన్‌లో గల ఆర్‌బీఎం యూపీ పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలతో స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గోపినాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్-117తో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. దీనిని రద్దుచేస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... పాఠశాల విద్యకు మరింత ప్రమాదం తెచ్చేపెట్టేలా జీవో 19, 20, 21లను తీసుకువచ్చి తొమ్మిది రకాల బడులను అమలు చేయడం అన్యాయమన్నారు. బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించినా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. దీంతో రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఏర్పడి ఆందోళనకు నిర్ణయించాయన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 21న డీఈవో కార్యాలయాలు ముట్టడికి పిలుపునిచ్చాయన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేయాలి: కలెక్టర్

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. డీపీఆర్‌కు అనుగుణంగా మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి తుదిచర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంకా రైల్వే, హెచ్‌పీసీఎల్, జలవనరులు, విద్యుత్, ఐవోసీఎల్, జాతీయ రహదారులు, అంతర్గత రోడ్ల విస్తరణ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణలో జాప్యం వద్దన్నారు. నిర్దీత సమయంలో భూ సేకరణ చేపట్టి నివేదించాలని స్పష్టం చేశారు. సమీక్షలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత మాధుర్, ఎస్డీసీ సుధాసాగర్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

వీడని ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

జనసేనకు చెందిన కోన తాతారావుకు డీసీసీబీ చైర్మన్ పదవిని ఇచ్చినందున భీమిలి నియోజకవర్గానికి న్యాయం చేయాల్సి ఉంది కాబట్టి, యాదవ మహిళనైన తనకు డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించాలని మొల్లి హేమలత విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు డిప్యూటీ మేయర్ పదవి నుంచి తొలగించిన జియ్యాని శ్రీధర్ కాపు సామాజిక వర్గానికి చెందినవారు కాబట్టి ఆ వర్గానికి తిరిగి ప్రాధాన్యం కల్పించేలా రెండుసార్లు కౌన్సిలర్, రెండుసార్లు కార్పొరేటర్‌గా పనిచేసిన తనకు అవకాశం ఇవ్వాలని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు కోరుతున్నారు. ఇలా వీరంతా ఎవరికి వారు తమకు అస్మదీయులైన ప్రజాప్రతినిధుల ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం రాత్రి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు మేయర్ కలిసి ఒక హోటల్‌లో సమావేశమై డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ఖరారు చేస్తారని ప్రచారం జరిగింది. అయితే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఈ సమావేశాన్ని ఆదివారానికి వాయిదా వేశారు. జనసేన పార్టీకి ఆగస్టులో ఖాళీ అయ్యే రెండో డిప్యూటీ మేయర్ పదవిని కేటాయిస్తారని ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీ నుంచి డిప్యూటీ మేయర్ పదవికి ఎవరూ పోటీలో లేనట్టేనని అంతా భావించారు. కానీ ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు డిప్యూటీ మేయర్ పదవిని తమకే కేటాయించేలా సీఎం చంద్రబాబుతో మాట్లాడాలని కోరుతూ పార్టీ ఎమ్మెల్సీ హరిప్రసాద్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు శుక్రవారం ఇద్దరు కార్పొరేటర్ల పేర్లతో కూడిన లేఖను పంపించారు. ఇప్పటికే ముగ్గురిలో ఎవరి పేరు ఖరారు చేయాలో తెలియక తలలుపట్టుకుంటున్న టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు జనసేన రూపంలో మరొక చిక్కుముడి వచ్చిపడినట్టయింది. దీంతో డిప్యూటీ మేయర్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఇదిలావుండగా టీడీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి వద్ద డిప్యూటీ మేయర్ ఎవరనే విషయాన్ని ప్రస్తావించగా... యాదవ మహిళను మేయర్ పదవి నుంచి తొలగించినందున ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళను డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేయకపోతే పార్టీకి ఆ వర్గం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ఆ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతురాలిని డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేయాలని మెజారిటీ కూటమి ప్రజాప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారని ఆయనన్నారు. మరోవైపు కాపు సామాజిక వర్గం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందున ఆ సామాజిక వర్గానికి ఫ్లోర్ లీడర్ పదవిని అప్పగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జనసేన పార్టీని కూడా సంతృప్తి పరిచేందుకు వీలుగా రెండో డిప్యూటీ మేయర్ పదవిని దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ కార్పొరేటర్‌కు ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. దీనివల్ల అన్ని వర్గాలు, పార్టీలను సంతృప్తిపరిచినట్టవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఆదివారం రాత్రికి డిప్యూటీ మేయర్ ఎవరనే దానిపై ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది.

ఇసుక సరఫరాలో గోల్‌మాల్‌పై కలెక్టర్ ఆరా

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్‌ను హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారి ఒకరు కలిసి వివరాలను నివేదించారు. జేసీ మయూర్ అశోక్‌ను కలిసి పూర్తి వివరాలు నివేదించాలని కలెక్టర్ సూచించడంతో ఆ ఇంజనీరింగ్ అధికారి జేసీని కలిశారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించే హౌసింగ్ అధికారులు కొందరు భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భారీగా పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు, క్షేత్రస్థాయిలో పనిచేసే పలువురు అధికారులు కలిసి ప్రభుత్వం సరఫరా చేసే ఇసుక, ఐరన్, సిమెంటు నుంచి కొంత మేర పక్కదారి పట్టించారనే ఫిర్యాదులున్నాయి. నాణ్యత లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా సైట్ ఇంజనీర్లను హెచ్చరించే సందర్భాలు ఒక్కటి కూడా లేదు. దీంతో ప్రతిపాదనల్లో పేర్కొన్న సిమెంటులో కొంత మొత్తాన్ని పక్కదారి పట్టించారని, ఇసుక విషయంలోనూ అక్రమాలు జరిగాయని పలు ఫిర్యాదులున్నాయి. గత ఏడాది ప్రభుత్వం మారిన తరువాత ఇసుకకు కొరత ఏర్పడే సమయంలో రీచ్‌ల నుంచి వచ్చే ఇసుకలో కొన్ని లోడ్లను దారిమళ్లించారు. పెద్ద కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయి చిన్నపాటి కాంట్రాక్టర్లకు కేటాయించే ఇసుక సరఫరాలో గోల్‌మాల్ చేశారనే వాదన ఉంది. అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే ముగ్గురు ఏఈలు సొంతంగా కార్లు వినియోగిస్తుండడం గమనార్హం. హౌసింగ్ కార్పొరేషన్‌లో ఈఈ, డీఈలకు మాత్రమే వాహన సదుపాయం ఉంది. ఏళ్లతరబడి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అనేకమంది ఏఈలు ద్విచక్ర వాహనం, లేదా ఈఈ/డీఈతోపాటు వాహనాల్లో తిరిగేవారు. అటువంటిది నగర శివార్లలో 98 వేల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో అక్రమాలకు పాల్పడుతున్న ఏఈలు కార్లు వినియోగిస్తుండడంపై అధికారులు ఆరా తీశారు.

20 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

... 5వ పేజీ తరువాయి

అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ సమావేశంలో నాయకులు నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఒకరోజు ఉద్యోగులతో పాటు సమ్మె చేద్దామని నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం ప్లాంటులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా యాజమాన్యంపై ఒత్తిడి పెంచాలనే ఉద్దేశంతో 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఉక్కు కర్మాగారంలో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఇటీవల సుమారు 1,750 మందిని అధికారికంగా తొలగించగా, మరో వెయ్యి మంది వారి కాంట్రాక్టు టెండర్లు పూర్తి కావడంతో విధులకు దూరంగా ఉన్నారు. ప్లాంటులో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించబోమని ప్లాంట్ యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.

దృష్టంతా చలానాలపైనే..

... 5వ పేజీ తరువాయి

సిబ్బంది ఒక గ్రూపుగా ఏర్పడి ఆ రోడ్డులో వచ్చే వాహనాలన్నింటినీ ఆపుతున్నారు. ఒక్కో వాహనంపై పెండింగ్ ఈ-చలానాలు ఎన్ని ఉన్నాయనేది తనిఖీ చేస్తున్నారు. ఒకవేళ ఏదైనా వాహనానికి సంబంధించి పెండింగ్ చలానాలు ఉన్నట్టు తేలితే వారితో అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో ఈ-చలానాల జరిమానాను కట్టించిన తరువాతే వాహనాన్ని విడిచిపెడుతున్నారు. ఇలా అందరూ ట్రాఫిక్ విధులను పక్కన పెట్టేసి ఈ-చలానాలను కట్టించడంలోనే నిమగ్నమవుతుండడంతో కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలు ఇష్టారాజ్యంగా సాగిపోతున్నాయి. దీని వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులతో పలువురు వాహనచోదకులు వాగ్వాదానికి కూడా దిగుతున్నారు. అయితే తామేమీ చేయలేమని, ఉన్నతాధికారులు చెప్పిన ఆదేశాలను పాటించాల్సిందేనని వారు వాపోతున్నారు. ప్రతి రోజూ 150 చలానాలను కట్టించాలని తమకు టార్గెట్ విధిస్తున్నారని, ఆ లక్ష్యాన్ని అందుకోలేకపోతే శాఖాపరమైన ఇబ్బందులకు తాము గురికావాల్సి వస్తుందని వాహనదారులకు నచ్చచెబుతూ ఈ-చలానాలను ట్రాఫిక్ పోలీసులు కట్టిస్తున్నారు.

హుద్‌హుద్ ఇళ్లను అమ్మేశారు

... 5వ పేజీ తరువాయి


నివాసం ఉంటున్నారు? వారు గతంలో ఆమోదించిన లబ్ధిదారుల జాబితాలో వారు ఉన్నారా? అద్దెకు ఉంటున్నారా? కొనుగోలు చేశారా? అనే కోణంలో విచారణ నిర్వహించారు. పైనాపిల్ కాలనీలో గల హుద్‌హుద్ గృహ సముదాయంలో మొత్తం పది బ్లాకులలో 320 ఇళ్లను నిర్మించారు. విచారణ సమయంలో 51 ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. లబ్ధిదారుల జాబితాలో ఉన్న 163 మంది ఇక్కడ నివాసం ఉంటున్నారు. మరో 26 మంది ఇళ్లను విక్రయించగా, 53 మంది అద్దె ప్రాతిపదికన ఉంటున్నారు. ఇంకా 22 ఇళ్లు ఖాళీగా ఉండగా ఒకరి ఇళ్ల డాక్యుమెంట్లు నకిలీవని తేలింది. మొత్తంగా 180 మంది వరకు స్థానికులు ఉండగా, మరో 106 మంది స్థానికేతరులు ఉన్నారని విచారణలో వెల్లడైంది. ఇందుకు సంబంధించిన నివేదికను జీవీఎంసీ కమిషనర్‌కు మధురవాడ జోనల్ కమిషనర్ అందజేశారు. నివేదికలో పేర్కొన్న విధంగా అనర్హులపై చర్యలు తీసుకుంటారా? లేదా అన్నది వేచి చూడాలి.

టీడీపీ 70వ వార్డు అధ్యక్షుడిగా చట్టి గోపి


ఎన్నికైన కమిటీ ప్రతినిధులు

గాజువాక, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 70వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా చట్టి గోపి నియమితులయ్యారు. గాజువాక పార్టీ కార్యాలయంలో పార్టీ పరిశీలకులు ఎంవీఎస్ చౌధురి, గాజువాక సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చట్టి గోపి, ఉపాధ్యక్షుడిగా కోయిలాడ శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా సీతిన ఈశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిగా రేమల శ్రీను, కోశాధికారిగా పల్లా అప్పలరాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోపూరి శ్రీరామ్మూర్తి మృతి టీడీపీకి తీరని లోటు : నల్లూరి


శ్రీరామ్మూర్తి (57)ఫైల్‌ఫోటో

కూర్మన్నపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డులోని భరత్‌నగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ఉక్కు ఉద్యోగి పోపూరి శ్రీరామ్మూర్తి (57) మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ అన్నారు. శనివారం శ్రీరామ్మూర్తి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి పార్టీలో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. అంతకుముందు శ్రీరామ్మూర్తి మృతదేహం వద్ద స్థానిక నాయకులు లేళ్ల కోటేశ్వరరావు, దామా సుబ్బారావు, వేగుంట శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, కాట్రగడ్డ దుర్గాప్రసాద్, మేకా శ్రీనివాసరావు, బొడ్డ రమణ, మురళీ, శ్రీను, పరదేశి నివాళులు అర్పించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

అగనంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి అగనంపూడి బీసీ కాలనీ సమీపంలో పెనుప్రమాదం తప్పింది. గంగవరం నుంచి హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గుతో వెళుతున్న లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో డీవైడర్‌పై నుంచి గెడ్డలోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గంగవరం పోర్టు నుంచి బొగ్గులోడుతో వస్తున్న లారీ సరిగ్గా అగనంపూడి బీసీ కాలనీ వద్దకు వచ్చే సరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. వెంకటనే డ్రైవర్ మసూద్ డీవైడర్ వైపునకు మళ్లించే అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయితే భారీ లోడ్ ఉండడంతో డీవైడర్‌పై గల రెయిలింగ్‌పై నుంచి గెడ్డలోకి దూసుకుపోయింది. ఆసమయంలో ఆటుగా వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈమేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు(తెలుపు)38, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళ దుంపలు 19, అరటికాయ(పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100,కొబ్బరికాయ(పెద్దది)25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 32, కాప్సికమ్48,పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100,కరివేపాకు(కిలో)35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట)3, చుక్కకూర(కట్ట)3, పాలకూర (కట్ట)3, తోటకూర(కట్ట)3, మామిడికాయలు20, బూడిదగుమ్మడికాయ 20, క్రరపెండలం18, జామకాయలు(కిలో)80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు బ్రాయిలర్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

స్టీల్‌ప్లాంటులో 20న సమ్మె యథాతథం

» స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాల వెల్లడి



ఉక్కుటౌన్‌షిప్, మే 17 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న సమ్మె చేస్తామని విశాఖ స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. అయితే దేశవ్యాప్త కార్మిక సమ్మె జూన్ 9కు వాయిదా పడినప్పటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె చేస్తామని కార్మిక నాయకులు ప్రకటించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తామని స్పష్టం చేశారు.

స్టీల్‌ప్లాంటులో సమ్మె చేస్తామని పేర్కొంటూ ఈ నెల 5వ తేదిన ఉక్కు యాజమన్యానికి అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, అదే విధంగా ఆరో తేదీన కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు సమ్మె నోటీసు ఇచ్చారు. దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు.

ఈ క్రమంలో దేశవ్యాప్త సమ్మె వాయిదా పడింది. అయితే దీనిపై ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు సమావేశమై స్థానిక సమస్యలపై సమ్మె చేద్దామని నిర్ణయించారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదని, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయవద్దని, సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని పేర్కొంటూ ఉద్యోగ సంఘాలు, కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, భద్రత పనిముట్లు అందజేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాలు సమ్మె చేయనున్నాయి.

నేడు నిర్వాసిత ప్రాంతాల్లో ర్యాలీ...

సమ్మె జయప్రదం చేయాలని పేర్కొంటూ ఆదివారం ఉక్కు నిర్వాసిత కాలనీలైన అగనంపూడి, వడ్లపూడి, పెదగంట్యాడ, గంగవరం, కూర్మన్నపాలెంతో పాటు టౌన్‌షిప్‌లో ర్యాలీలు నిర్వహించనున్నారు. అదే విధంగా సోమవారం సాయంత్రం 5.30గంటలకు ప్లాంట్ ప్రధాన గేటు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని అఖిలపక్ష కార్మిక నాయకులు తెలిపారు.

సందడిగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



కార్యక్రమంలో పాల్గొన్న ఐటీఐ జోన్-1 డిప్యూటీ డైరెక్టర్ ఆర్వీ రమణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, 65వ వార్డు కార్పొరేటర్ నరసింహపాత్రుడు

గాజువాక, మే 17 (ఆంధ్రజ్యోతి) : గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీఐ జోన్ -1 డిప్యూటీ డైరెక్టర్ ఆర్వీ రమణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని, ప్రస్తుత సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తమ పుట్టిన రోజు నాడు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు,పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్టు కార్యదర్శి శివనాగేశ్వరరావు, మేనేజింగ్ ట్రస్టీరేవతి, సీఈవోవర్మరాజు, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరవాస కాలనీలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. శీతల పానీయాలకు దూరంగా ఉండాలని, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్ల తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, ఇల్లపు ప్రసాద్, స్థానిక నాయకులుపాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డులోని గణేష్‌నగర్‌లో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ వేసవిలో ఎండలు అధికంగా ఉండటం వల్ల ఎక్కువగా స్వచ్ఛమైన నీటిని తాగాలని, బయటకు వెళ్లేటప్పుడు వెంట గొడుగులు తీసుకు వెళ్లాలని, వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాలిథిన్ వినియోగం పూర్తిగా నిషేధించాలని, చికెన్, మటన్, చేపలు కొనుగోలు చేసినప్పుడు స్టీలుబాక్సులు, జ్యూట్ బ్యాగులు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌విజయరామరాజు, రాజన్‌రాజు, ప్రగడ దానయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, పరమానందం, విశ్వేశ్వరరావు, నాగభూషణం, పరమేశ్వరరావు, ఆరంద్‌కుమార్, శివయ్య, కృష్ణ, రాంబాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.


శ్రీగణేష్ నగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్-స్వచ్ఛంధ్రలో పాల్గొన్న కార్పొరేటర్ బొండా జగన్, కాలనీ వాసులు

ఉక్కు ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేత

ఉక్కుటౌషిప్, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో పని ప్రదేశం వదిలి సమావేశమయ్యారని పేర్కొంటూ సస్పెండ్ చేసిన నలుగురు ఉద్యోగులపై యాజమన్యం సస్పెన్షన్ ఎత్తివేసినట్టు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా, సంస్థకు ఇబ్బంది కలిగించకుండా కేవలం మధ్యాహ్నం భోజన సమయంలో కార్మికులు సమావేశమయితే సస్పెండ్ చేయడం సరికాదని, ఈ క్రమంలో సస్పెన్షన్ ఎత్తివేయాలని యాజమాన్యాన్ని కోరామని నాయకులు తెలిపారు.

జూలో మూడు రకాల జంతువులకు సంతానోత్పత్తి


ఇండియన్ గ్రే ఊల్ఫ్ కూన (తోడేలు పిల్ల)

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఒక తోడేలు పిల్ల, బెంగాల్ జాతికి చెందిన నక్కపిల్ల, ఒక లెమూర్ పిల్ల జన్మించినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అంతరించిపోతున్న తోడేళ్ల షెడ్యూల్-1 జాతికి చెందినవని తెలిపారు. ఈ జాతి తోడేళ్లను 2019లో మైసూరు జూ నుంచి తీసుకొచ్చినట్టు తెలిపారు. అలాగే బెంగాల్ జాతికి చెందిన నక్కపిల్లలను ఢిల్లీ జూ నుంచి జంతు మార్పిడి విధానంలో 2021లో తీసుకొచ్చినట్టు తెలిపారు. మడగాస్కర్ జాతికి చెందిన రింగ్ టైల్డ్ లేమ్యూర్‌ని ఇజ్రాయిల్ జూ నుంచి 2013లో తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ జంతు ప్రదర్శనశాలలో వీటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుని, ఈ జంతువుల సంతానోత్పత్తి కూడా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కొన్ని రోజుల కిందట ఆయా జంతువులకు పిల్లలు పుట్టినట్టు జూ క్యూరేటర్ తెలిపారు.


రింగ్ టైల్డ్ లెమ్యూర్ కూన


బెంగాల్ ఫాక్స్ కూన

అర్హులకు టిడ్కో ఇళ్లు ఖాయం

» పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

» ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి టిడ్కో ఇళ్లను అందించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వైసీపీ ప్రభుత్వం మాదిరిగా మోసం చేయలేదని రాష్ట్ర ప్రభుత్వ విప్ , పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధి (40, 58 నుంచి 63) వార్డుల్లో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అధికారులతో శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క లబ్ధిదారునితో ఆయన చర్చించి పలు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016లో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు కట్టిన వారందరికి ఇళ్లు అందిస్తామని చెప్పారు. లబ్ధిదారుల్లో ఎవరైన గతంలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, సమయానికి కట్టని వారికి సివిల్‌స్కోర్ తగ్గిపోవడం వల్ల మళ్లీ రుణాలు ఇవ్వడానికి అవి ఆలోచిస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో వారికి టిడ్కో ఇళ్లు రావడం కష్టమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై బ్యాంకులతో ప్రభుత్వం మాట్లాడుతోందని ఆయన తెలిపారు. త్వరలోనే అచ్చినాయుడుతోట, ములగాడ గ్రామాలలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. కూటమి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని అన్నారు. లబ్ధిదారులు తమ వివరాలను తనిఖీ చేసుకోవడానికి, సమస్యలుంటే వాటిని పరిష్కరించుకోవడానికి ప్రత్యేకంగా కౌంటర్లను కూడా ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ 5 కమిషనర్ రాము, ఏపీడీవో కృపానందం, సీడీవోలు, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్న), వార్డుల టీడీపీ అధ్యక్షులు, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావుతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకు బకాయిల గురించి ఆవేదన

తామంతా పేదోళ్లమని, ఏదో కొద్దిపాటి అవసరం కోసం ప్రైవేటు బ్యాంక్‌ల దగ్గర నుంచి రుణాలు తీసుకున్నామని, సివిల్‌స్కోర్ బాగులేకపోతే అర్హత ఉన్నప్పటికీ టిడ్కో ఇళ్లు ఇవ్వరా? అంటూ పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచన చేసి తమలాంటి పేదవారికి ఇళ్లు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వేడుకుంటున్నారు.

కోరమండల్ కంపెనీ సేవలు అమోఘం

» పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): కోరమండల్ ఎరువుల కర్మాగారం సామాజిక సేవ కార్యక్రమంలలో భాగంగా అందిస్తున్న ప్రజాసేవ కార్యక్రమాలు అమోఘమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం గ్రామంలో రూ.34 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనాన్ని సామాజిక అవసరాల కోసం వినియోగించాలని సూచించారు. అనంతరం శ్రీరామ్‌నగర్‌లో రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను, రూ.4 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఉద్యోగులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం

» పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చి

పెందుర్తి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మంచి అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చి అన్నారు. పెందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక చింతలఅగ్రహారం బస్‌స్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సీపీ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. వృందా క్యాన్సర్, అనిల్ నీరుకొండ ఆసుపత్రులకు చెందిన క్యాన్సర్, గైనికాలజిస్టు, ఆర్థోపెడిస్ట్, జనరల్, ఇఅండ్‌టీ, డెంటల్, కంటి విభాగాలకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొని రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పెందుర్తి ఎంపీడీవోగా గుండు అప్పలరాజు

పెందుర్తి, మే 17(ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఎంపీడీవోగా గుండు అప్పలరాజు నియమితులయ్యారు. ఇంతకు ముందు ఈవోఆర్డీగా పనిచేసిన ఆయనకు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. శనివారం కార్యాలయంలో ఎంపీడీవోగా అప్పలరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పదిహేను పంచాయతీల అభివృద్ధి, పథకాల అమలుపై చర్చించారు.

మేయరు పీలాకు సమస్యల విన్నపాలు

పెందుర్తి, మే 17(ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలో ఉడాకాలనీ, రైల్వేవిహార్, ఉడాలేఔట్ కాలనీల సంఘ ప్రతినిధులు శనివారం నగర మేయరు పీలా శ్రీనివాసరావుని మర్యాదపూర్వంగా కలిశారు. తమ కాలనీల్లో పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా పీలా ఉడా కాలనీలో పర్యటన చేసి సమస్యలను పరిష్కరానికి చర్యలు చేపడతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపూర్ణంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'


స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మల్కాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నెలలో మూడో శనివారం చేపడుతున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పారిశ్రామిక ప్రాంతంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు శనివారం విజయవంతంగా చేపట్టారు. జీవీఎంసీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించి, ప్రతిజ్ఞలు చేయించి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కోసం ప్రజలకు తెలియజేశారు. వేసవిలో తీసుకోవాలిన్స జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో

గోపాలపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 3వ శనివారం చేపడుతున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని గ్రేటర్ పరిధి 92వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 'బీట్ ద హీట్' కార్యక్రమంలో భాగంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎన్ఏడీలో

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 17(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం నైట్ షెల్టర్ దగ్గర శానిటరి విభాగం ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పురస్కరించుకుని, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యుడు, వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎమ్‌హెచ్ఓ డాక్టర్ బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలుంటే ఆసుపత్రికి రావాలన్నారు.

కాకానీనగర్ ఫ్లైఓవర్ పనులు పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్ మే 17(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి ఎన్ఏడీ నుంచి కాకానీనగర్ వరకు జరగుతున్న ఫ్లైఓవర్ ఆర్‌ఓబీ పనులను శనివారం ప్రభుత్వ విప్ గణబాబు, వీఎమ్ఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. దీంతో కాకానీనగర్ సిగ్నల్ పాయింట్‌లో ఆర్‌ఓబీ నిర్మాణానికి ఇటీవలే వీఎమ్ఆర్‌డీఏ నిధులు మంజూరు చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో గాలికొదిలేసిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతోందని అన్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే స్థానిక కాలనీలకు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఆయన అన్నారు.

ఆక్రమిత ఏపీఐఐసీ భూమిలో హెచ్చరిక బోర్డులు తొలగింపు

» ఆక్రమణదారుల పనేనని అనుమానం


హెచ్చరిక బోర్డును తొలగించి కింద పడేసిన దృశ్యం

కూర్మన్నపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలో వైసీపీ హయాంలో కొందరు ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో సర్వే నెంబరు 123, 108/5లో సుమారు 97 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమనకు గురైంది. ప్రస్తుతం ఇది మార్కెట్ విలువ ప్రకారం రూ.12 కోట్లు ఉంటుందని అంచనా. ఆ భూమిలో చుట్టూ ప్రహరీ కట్టించారు. ఈ భూ ఆక్రమణలు అప్పటి ఏపీఐఐసీ అధికారుల సమ్మతితోనే జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు ఆ భూమిపై స్టీల్‌ప్లాంట్, రెవెన్యూ, ఏపీఐఐసీ వేర్వేరుగా సర్వేలు నిర్వహించి తమది కాదంటే తమది కాదని తేసిపుచ్చారు. ఆక్రమణల తొలగింపుపై ఏపీఐఐసీ తాత్సారం అని 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ భూ ఆక్రమణలపై పలువురు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఏపీఐఐసీ చర్యలకు ఉపక్రమించింది. ఏపీఐఐసీ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఐలా కమిషనర్ ఎ.కిషోర్ ఇటీవల ఆ భూమిలో ఇటీవల హెచ్చరిక బోర్డులు పెట్టించారు. ఆ భూమి ఏపీఐఐసీకి చెందినదని, ఆక్రమణదారులు శిక్షార్హులు అని పేర్కొన్నారు. అయితే ఆ బోర్డులను గుర్తుతెలియని వ్యక్తులు పీకేసి కింద పడేశారు. ఇది ఆక్రమణదారుల పనేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బోర్డులు తొలగించిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించలేకపోయారు

» శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఎద్దేవా

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన జీవీఎంసీకి నాలుగు నెలలుగా కమిషనర్‌ను నియమించలేకపోయారని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేకేరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న బొత్స అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవీఎంసీ కమిషనర్ లేక నగరంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కలెక్టర్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించినప్పటికీ సాధారణ విధుల ఒత్తిడి ఉండడంతో జీవీఎంసీ కార్యకలాపాలపై దృష్టిపెట్టేందుకు సమయం ఉండడంలేదన్నారు. కనీసం వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా కొంతవరకు ఉపయోగం ఉండేదని బొత్స అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ బియ్యం రవాణాను పౌరసరఫరాల శాఖ మంత్రి స్వయంగా పట్టుకున్నారని, ఇంతవరకు దానిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వ్యవస్థలను నేతలు చేతుల్లోకి తీసుకోవడం వల్లే వీరయ్యచౌదరి వంటి వారి హత్యలు జరుగుతున్నాయన్నారు.

పేదలకు నిత్యావసరాలు అందజేత


సరుకులు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

అగనంపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి చట్టి వానిపాలెంలోని నిరుపేద కుటుంబాలకు స్థానిక సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో శనివారం నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మాజీ చైర్మన్ గుదే సుశీలగజేంద్రరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆదుకోవాల్సిన బాధ్యతపై సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పట్టా రామఅప్పారావు, నరసింగరావు, శీరంశెట్టి గోవిందరావు, మస్తాన్‌రెడ్డి, బొండా ఈశ్వరరావు పాలొన్నారు.

శ్రీవారికి సహస్ర మామిడి అర్చన

పెందుర్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సహస్ర సూత ఫల మామిడి పళ్ల అర్చన చేశారు. వైశాఖమాసం సందర్భంగా మూలవిరాటు విగ్రహానికి 1008 మామిడి పళ్లతో అర్చన, ప్రత్యేక పూజలు చేశారు.

బీచ్ పార్కింగ్ స్థలంలో జీసీసీ అవుట్‌లెట్

» నిర్మాణ పనులు తగవని ఫిర్యాదులు



ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం పక్కన పార్కింగ్ స్థలంలో పనులు చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ(జీసీసీ) రామకృష్ణా బీచ్‌లో కురుసుర సబ్‌మెరైన్‌కు ఎదురుగా ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం పక్కన పార్కింగ్ స్థలంలో దుకాణం ఏర్పాటుకు పనులు ప్రారంభించింది. జీసీసీ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేసి, గిరిజన ఉత్పత్తులు, కాఫీ విక్రయాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జీసీసీ ఉన్నతాధికారులు జీవీఎంసీకి లేఖ రాసి, బీచ్ రోడ్డులో 400 నుంచి 600 చ.అ. స్థలాన్ని రిటైల్ మార్కెటింగ్ విభాగం తరపున దుకాణం ఏర్పాటుకు కేటాయించాలని కోరారు. జీవీఎంసీ అధికారులు బీచ్‌కు వచ్చే సందర్శకులు పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్న స్థలాన్ని కేటాయించారు. రెండు రోజుల కిందట పనులు ప్రారంభించడంతో స్థానికులు, వ్యాపారులు జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. జీసీసీకి వీఎంఆర్‌డీఏ పార్కు ఎదురుగా పెద్ద అవుట్‌లెట్, కాఫీ షాపులు ఉన్నాయని, మళ్లీ ఇప్పుడు పార్కింగ్ స్థలాన్ని కేటాయించడం తగదని పేర్కొన్నారు. పార్కింగ్ స్థలం కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదు చేశారు. తక్షణమే పనులు నిలిపివేసి, వేరే ప్రాంతంలో స్థలం కేటాయించాలని సూచించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.57,650 విలువ గల 11.53 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కాకినాడకు చెందిన మోర్త విజేంద్ర(19), పి.సంతోష్‌కుమార్ (19)లు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.


సీటుకు రూటు.. ఈ వెబ్‌సైట్

ర్యాంకు, కళాశాలలపై స్పష్టత

» నూతన వెబ్‌సైట్‌ను రూపొందించిన నగర విద్యార్థులు

» విద్యార్థులకు మేలు చేసే ప్రయత్నం

» ప్రస్తుతం ఎంసెట్‌కే పరిమితం.. భవిష్యత్‌లో జేఈఈ మెయిన్స్, క్యాట్‌కు విస్తరణ



కాలేజ్ ర్యాంక్ వెబ్‌సైట్

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే అర్హత పరీక్షలో వచ్చే మార్కులను బట్టి ర్యాంకు, మార్కులను గమనించి ఏ కళాశాలలో సీటు వస్తుందో అంచనా వేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ర్యాంకును బట్టి ఏ కళాశాలలో సీటు వచ్చే అవకాశం ఉందో తెలుసుకుంటూనే, ఆ కళాశాలల జాబితాను ఒకే చోట చూసుకునే వెసులుబాటుతో విద్యార్థులకు మేలు చేకూరుతుంది. ఎంతో మంది విద్యార్థులకు తమకు వచ్చే ర్యాంకులకు అనుగుణంగా ఏ కళాశాలలో, ఏ బ్రాంచ్‌లో సీటు వస్తుందో అవగాహన లేక తొందరపడి ఏదో ఒక కళాశాలలో చేరిపోతుంటారు. ఆ తరువాత కోరుకున్న కళాశాలలో అవకాశం ఉన్నప్పటికీ సీటు పొందలేకపోయామని బాధపడుతుంటారు. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్న నగరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దీనికి పరిష్కారమార్గం చూపాలని భావించారు. విద్యార్థులకు వచ్చే మార్కులను బట్టి ర్యాంకును అంచనా వేస్తూ ఏయే కళాశాలల్లో సీటు వస్తుందో ముందుగానే గుర్తించేలా కాలేజీ ర్యాంకు డాట్ ఇన్ (collegerank.in) పేరుతో వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఫలితాలకు ముందే తమకు వచ్చే మార్కులను అంచనా వేస్తే ర్యాంకు ఎంత వస్తుందో ఈ వెబ్‌సైట్ చెబుతుంది. మార్కులు విడుదలైన తరువాత అభ్యర్థి పేరు, కులం, లింగం వంటి వివరాలు నమోదు చేస్తే సీటు, బ్రాంచ్ వచ్చేందుకు అవకాశం ఉన్న కళాశాలల జాబితా వివరాలు డిస్ ప్లే అవుతాయి.

ముగ్గురు విద్యార్థుల ప్రతిభ..

ఈ వెబ్‌సైట్‌ను నగరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రూపొందించారు. విజ్ఞాన్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో ఏడాది చదువుతున్న జి.జతిన్, సీహెచ్ యుగంధర్, ఇంజనీరింగ్ పూర్తి చేసిన కె.లక్ష్మి అనే విద్యార్థులు ఏడాదిపాటు శ్రమించి సుమారు రూ.4 లక్షల వరకు వెచ్చించి దీన్ని రూపొందించారు. కలామ్ డ్రీమ్ ల్యాబ్స్‌లో దీనికి సంబంధించిన పరిశోధన ప్రారంభించి పూర్తి చేశారు. ఏ విద్యార్థి కూడా తనకు వచ్చిన మార్కులకు అనుగుణంగా మంచి సీటును కోల్పోకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే దీన్ని రూపొందించినట్టు విద్యార్థులు తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన తరువాత విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉత్తమమైనవి ఏవి, తమకు వచ్చిన ర్యాంకులకు ఏ కళాశాలలో సీటు వస్తుందనే విషయాలపై అవగాహన ఉండదని, అటువంటి వారికి పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తూ, కౌన్సెలింగ్‌కు సంబంధించిన మాడ్యూల్‌లో ఈ వెబ్‌సైట్‌ను డిజైన్ చేసినట్టు పరిశోధన చేసిన విద్యార్థులు తెలిపారు. వివరాలు నమోదు చేయగానే వచ్చే జాబితాను తమ సన్నిహితులకు పంపి వారి సలహా మేరకు మంచి కళాశాలను ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉందని వివరించారు.

ప్రస్తుతం ఎంసెట్ వరకు..

ఏపీ, తెలంగాణ ఎంసెట్ రాసే విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి వచ్చిన వెంటనే కీ చూసుకుని తమకు వచ్చే మార్కులను 'కాలేజీ ర్యాంకు డాట్ ఇన్' వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఎంటర్ చేస్తే ఎంత ర్యాంకు వస్తుందో చెబుతుంది. అలాగే, ర్యాంకు వివరాలు నమోదు చేయడంతోపాటు పేరు, కులం, లింగం వంటి సమాచారాన్ని పొందుపరచగానే ఆ ర్యాంకుకు ఏ కళాశాలలో సీటు వస్తుందో జాబితాను చూపిస్తుంది. ఇందులో తమకు సమీప ప్రాంతంలోని కళాశాలలను కూడా ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. ఇందుకోసం గడిచిన ఐదేళ్లకు సంబంధించిన డేటాను ఏఐ సహాయంతో పొందుపర్చారు. గతంలో వచ్చిన ర్యాంకులకు ఏయే కళాశాలల్లో సీట్లు వచ్చాయో బేరీజు వేసుకుని ఏఐ సహాయంతో ఇప్పుడు ఆయా మార్కులకు, ర్యాంకులకు ఎక్కడ సీటు వస్తుందో తెలియజేసేలా దీన్ని రూపొందించారు. ఇందులో మూడు రకాల కేటగిరీలను విద్యార్థులకు చూపిస్తుంది. గ్రీన్ కలర్‌లో వచ్చే కళాశాలల జాబితాలో విద్యార్థికి తప్పనిసరిగా ఫలానా కాలేజీలో సీటు వస్తుందని అంచనా. ఎల్లో కలర్‌లో అయితే సీటు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. రెడ్ కలర్‌లో వచ్చే కాలేజీ జాబితాలో అయితే విద్యార్థికి ఆయా కాలేజీల్లో సీటు వచ్చే అవకాశం తక్కువ అని అర్థం. డిజైన్ చేసిన ప్రత్యేక ఇండికేటర్ ఈ సమాచారాన్ని సూచిస్తుంది.



వెబ్‌సైట్ రూపొందించిన విద్యార్థులు

భవిష్యత్‌లో మరింత విస్తరణ..

ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌ను ఏపీ, తెలంగాణ ఎంసెట్‌కు సంబంధించి మాత్రమే పరిమితం చేశారు. భవిష్యత్‌లో జేఈఈ మెయిన్స్, క్యాట్, ఇతర ప్రవేశ పరీక్షలన్నింటికీ విస్తరించే యోచనలో విద్యార్థులు ఉన్నారు. ఎంసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన ఇంటర్‌ఫేస్ మాదిరిగా దీన్ని రూపొందించడంతో విద్యార్థులకు మరింత సులభంగా ఉంటుందని ఈ విద్యార్థులు చెబుతున్నారు. ఎంసెట్ రాసే విద్యార్థులు ఈ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని విద్యార్థులు కోరారు. వచ్చే ర్యాంకుకు అనుగుణంగా కాలేజీల్లో సీటు సాధించే ఉద్దేశంతోనే దీన్ని రూపొందించినట్లు వీరు వెల్లడించారు. ఇది కళాశాలలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని, అనేక కాలేజీల్లో మిగిలిపోయే సీట్లకు ఇది పరిష్కారంగా నిలుస్తుందని, అదే సమయంలో విద్యార్థులు కూడా ఉత్తమ కళాశాలల్లో నచ్చిన బ్రాంచ్‌ల్లో సీటు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని వెబ్‌సైట్ రూపకర్తలు జి.జతిన్, సీహెచ్ యుగంధర్, కె.లక్ష్మిలు వివరించారు. కొన్నిసార్లు నచ్చిన కాలేజీలో సీటు వచ్చినా నచ్చిన బ్రాంచ్‌లో రాదని, ముందుగానే వీటిపై ఒక స్పష్టత వస్తే కౌన్సెలింగ్ సమయంలో ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ సిఈఓ అరుణ్ మిశ్రా

నేటి మీ ఆలోచనే రేపటి ప్రపంచం

» విద్యార్థులకు హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ సీఈవో అరుణ్ మిశ్రా సూచన

» ఘనంగా ఐఐపీఈ స్నాతకోత్సవం

బీచ్ రోడ్డు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మీ ఆలోచనే రేపటి ప్రపంచం అని హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ సీఈవో అరుణ్ మిశ్రా పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (విశాఖపట్నం) ఐదో వార్షిక స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలు, ఆలోచనలే రేపటి భవిష్యత్తుకు నాంది అని అన్నారు. జీవితంలో కళాశాల సమయం ఎంతో విలువైనదని, ఇక్కడ నుంచే జీవన ప్రయాణం ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు నేర్చుకున్న పాఠాలు, సంస్కారం, ప్రవర్తన, క్రమశిక్షణపైనే సమాజంలో వారు ఏ విధమైన పాత్ర పోషిస్తారనే విషయం ఆధారపడి ఉంటుందన్నారు. కళాశాలలో ఉన్నంతవరకు ఎంతో సంతోషంగా, ఉల్లాసంగా స్నేహితులతో గడిపే అవకాశం ఉంటుందని, అయితే బయట ప్రపంచం భిన్నంగా ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా మసలు కోవాల్సి ఉంటుందన్నారు. బోర్డు రిజిస్ట్రార్ రామ్‌పాల్ ద్వివేది మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధితో సూక్ష్మ తరహా పరిశ్రమలను నెలకొల్పి పారిశ్రామికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. తద్వారా పలువురికి ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులకు నైపుణ్యం అవసరమన్నారు. పోటీ ప్రపంచంలో ఎదగడం నైపుణ్యం మీదే ఆధార పడి ఉంటుందన్నారు. ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడం ఎంత కష్టమో, పెట్టుబడి పెట్టి వ్యాపారాలు ప్రారంభించడం అంతే కష్టమని, ఇక్కడ ఎలాంటి పెట్టుబడి లేకుండా మీ స్కిల్‌తో సొంత వ్యాపారంలా ఆశించిన దానికన్నా మించిన ఆదాయాన్ని పొందే అవకాశం ప్రతి ఒక్కరికీ లభిస్తుందన్నారు. ఈ స్నాతకోత్సవంలో రెండు పీహెచ్‌డీలు సహా 51 డిగ్రీలను ప్రదానం చేశారు. అందులో ఎమ్మెస్సీ (అప్లైడ్ జియాలజీ)లో 15, బి.టెక్‌లో 34 డిగ్రీలు, పెట్రోలియం ఇంజినీరింగ్ 8, కెమికల్ ఇంజినీరింగ్‌లో 26 డిగ్రీలను ప్రదానం చేశారు. మిస్టర్ ఆల్బర్ట్ ఇజాక్ మొహింతీ బీటెక్ (కెమికల్ ఇంజినీరింగ్) అకడమిక్ ఎక్సలెన్స్ ఆల్‌రౌండ్ మెరిట్‌కు ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్ లభించింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.కె.బానిక్, డైరెక్టర్ శాలివాహన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కెమికల్ ఇంజనీర్ అల్బర్ట్ ఐజాక్ మహంతికి గోల్డ్‌మెడల్ అందజేస్తున్న హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ సిఈఓ అరుణ్ మిశ్రా

భెల్ హెచ్‌పీవీపీలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ స్పెషల్ టీం

అక్కిరెడ్డిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : భెల్ హెచ్‌పీవీపీలోకి శనివారం రాత్రి మాస్కులు ధరించి చేతిలో ఆయుధాలతో ప్రవేశించిన అయిదుగురు గుర్తుతెలియని వ్యక్తులు మెయిన్‌గేటు వద్దనున్న సెక్యూరిటీపై కాల్పులు జరిపి అడ్మిన్ కార్యాలయంలోకి ప్రవేశించారు. అడ్మిన్ కార్యాలయంలో ఉన్న సిబ్బందిని బంధించి పలు డిమాండ్లు పెట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆక్టోపస్ స్పెషల్ టీం స్థానిక పోలీసుల సహాయంతో కర్మాగారంలో ప్రవేశించి టెర్రరిస్టులను అంతమొందించడంతో పాటు సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇదంతా ఆక్టోపస్ స్పెషల్ టీం అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి సారథ్యంలో గాజువాక పోలీసుల సహకారంతో ఆక్టోపస్ స్పెషల్‌టీం చేసిన మాక్‌డ్రిల్. ఆద్యంతం ఉత్కంఠంగా సాగింది. ఉగ్రవాదులు కర్మాగారంలో ప్రవేశించి సిబ్బందిని బంధిస్తే ఎలా ఎదుర్కోవాలో అనే అంశంపై శనివారం రాత్రి భెల్ హెచ్‌పీవీపీలో ఆక్టోపస్ పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందుకోసం కొంత సమయం అడ్మిన్ కార్యాలయం వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేసి మాక్‌డ్రిల్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మాక్ డ్రిల్‌లో ఆక్టోపస్ స్పెషల్ టీంతో పాటు గాజువాక ఏసీపీ త్రినాథ్, సీఐ పార్థసారదితో పాటు గాజువాక పోలీసులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ఈపీడీసీఎల్ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సీఎండీ పృథ్వీతేజ్, చొక్కాకుల శ్రీనివాస్

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): డేటా ఆధారిత నిర్ణయాలు మరింత శక్తిమంతంగా ఉండటానికి ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్(సీపీఆర్)తో ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) శనివారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్, ఐటీ విభాగం సీజీఎం పి.శ్రీనివాస్, సీపీఆర్ అధ్యక్షులు చొక్కాకుల శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖ, పురపాలక శాఖలకు ఇప్పటికే సీపీఆర్ సేవలు అందిస్తున్నదని, ఇకపై ఈపీడీసీఎల్‌తో పనిచేయనుందని, డేటా అనలిటిక్ యూనిట్‌ను సమర్థంగా ఉపయోగించుకుంటామని చెప్పారు. బిల్లింగ్ వ్యవస్థలో రెవెన్యూ నష్టాలు తగ్గే అవకాశం ఉందన్నారు.

ఎంఎస్‌ఎంఈ ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్, ఇతర అధికారులు

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఎంఎస్‌ఎంఈ సెట్-2025ను ఈ నెల 11న జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఫలితాలను శనివారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు విడుదల చేశారు. ఈ పరీక్షకు మొత్తం 520 మంది విద్యార్థులు హాజరయ్యారు. 120 మార్కులకు నిర్వహించిన పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి 100 మార్కులు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, ఎంఎస్‌ఎంఈ సెట్ కన్వీనర్ వి.సిద్ధయ్య, కాన్ఫిడెన్షియల్ సెక్షన్ డీన్ టి.రాఘవరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.ప్రసాద్ రెడ్డి, ప్రొఫెసర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

» నగరవాసులకు మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపు

» వేసవి నుంచి ఉపశమనానికి 'బీట్ ద హీట్' పేరిట కార్యక్రమాలు

» నీటిని ఆదా చేయడంతో పాటు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి



మొక్క నాటుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

మద్దిలపాలెం, మే 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో శనివారం శివాజీ పార్కులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా 'బీట్ ద హీట్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగానే 'బీట్ ద హీట్' నినాదంతో నగరంలో వేసవి ఉపశమనానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వేసవి ఉష్ణోగ్రతను తగ్గించేందుకు ప్రతిఒక్కరు విధిగా మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి భావితరాలకు స్వచ్ఛమైన విశాఖను అందించాలని, నీటిని వృథా చేయకుండా ఆదా చేయాలని మేయర్ కోరారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ బస్టాపుల్లో మట్టి కుండల్లో నీటిని ఏర్పాటు చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు వాటిని శుభ్రపరచాలన్నారు. ఇంటి ఆవరణలో పక్షుల, ఇతర జంతువుల కోసం నీటిని, ఆహారాన్ని అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. తడి వ్యర్థాల నుంచి సేంద్రీయ ఎరువును తయారుచేసి పూల, కూరగాయల మొక్కలకు వినియోగించాలని పేర్కొన్నారు. అనంతరం జీవీఎంసీ రూ.1.5 కోట్ల నిధులతో సమకూర్చిన మూడు జేసీబీ, ఒక జేసీబీ ఎస్కలేటర్, టారస్, ట్రాలర్ వాహనాలను మేయర్ ప్రారంభించారు.

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రను సాధిస్తే స్వర్ణాంధ్ర ఆవిర్భవిస్తుందన్నారు. అందరూ పర్యావరణాన్ని పరిరక్షించి మన ఆస్తిగా భావితరాలకు అందించాలని కోరారు. డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో ప్రజలు వేసవి నుంచి ఉపశమనం పొందడానికి గ్రీన్ షెడ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 106 చలివేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నామన్నారు. అందరూ నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత విశాఖ కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 'బీట్ ద హీట్' పోస్టర్లను ఆవిష్కరించారు. పలు ఎన్జీవోలు ఏర్పాటు చేసిన టెర్రస్ గార్డెన్, వరికంకులు, చిరుధాన్యాలు స్టాళ్లను సందర్శించడంతో పాటు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ డీవీ రమణమూర్తి, ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్‌రాజు, ప్రధాన వైద్యాధికారి నరేశ్‌కుమార్, పలువురు జోనల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్షమాభిక్షపై ముగ్గురు ఖైదీల విడుదలకు అవకాశం

» విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, మే 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు జీవిత ఖైదీలు క్షమాభిక్షపై విడుదల అయ్యేందుకు అవకాశం ఉందని కేంద్రకారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పదేళ్ల జైలుశిక్షతో పాటు మూడేళ్ల రిమిషన్ ప్రకారం మొత్తం ముగ్గురు ఖైదీలకు ఈ జైలు నుంచి విడుదల అయ్యేందుకు అర్హత ఉందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హత గల వారి పేర్లను రాష్ట్ర జైళ్ల శాఖకు నివేదించినట్టు చెప్పారు. ఖైదీలను ఎప్పుడు విడుదల చేసేదీ ఇంకా ఖరారు కాలేదన్నారు.

ఓడ రేవులలో పర్యటించిన రైల్వే ఏజీఎం



అరణ్యలో రైల్వే ఏజీఎం బెహరా తదితరులు

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే అదనపు జనరల్ మేనేజర్ మోహెస్ కుమార్ బెహరా శనివారం విశాఖ పోర్టు అథారిటీ, అదానీ పోర్టులలో పర్యటించి రైల్వే కార్యకలాపాలను పరిశీలించారు. సైడింగ్, లోడింగ్ పాయింట్ల వద్ద పనులను పరిశీలించారు. ముందుగా విశాఖ పోర్టు అథారిటీ సమావేశమై కార్గో రవాణా అభివృద్ధికి సంబంధించి రేక్‌లను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంపై చర్చించారు. ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కార్యకలాపాలు వేగవంతమవుతాయని, పరస్పరం బలోపేతానికి రైల్వే నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అదానీ పోర్టులో సీఈవో అమిత్ మాలిక్‌తో సమావేశమై వివిధ సామర్థ్య ప్రాజెక్టులపై చర్చించారు. రేక్ డిటెక్షన్, ఇతర కీలక అంశాలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

'అరణ్య' కేంద్రాన్ని పరిశీలించిన ఏజీఎం బెహరా

పోర్టుల పర్యటన అనంతరం వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయం సమీపంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అవుట్ డోర్ క్యాంపింగ్‌కు చెందిన అరణ్య కేంద్రాన్ని పరిశీలించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్ల కార్యకలాపాలకు సంబంధించిన క్లైంబింగ్ వాల్, టైర్ వాల్, టైర్ టవర్, రోప్ క్లైంబింగ్, మంకీ బ్రిడ్జి, కమాండో బ్రిడ్జి, మోగ్లీ జంపింగ్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) ఎ.కె.మొహరానా పాల్గొన్నారు.